ప్రజాశక్తి

ఆదివారం 9 జూన్ 2024 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలసుందరరావు

పెంచిన చేతులే
గొంతు కోశాయి..

- పెంచుకుంటున్న వారే శాన్విని హత్య చేశారు..
- డీఎస్పీ బాలసుందరరావు

ప్రజాశక్తి-కంభం రూరల్

పెంచుకున్న వారే బాలిక శాన్విని గొంతు కోసి హత్య చేశారని మార్కాపురం డీఎస్పీ ఎం.బాలసుందరరావు తెలిపారు. కంభం సీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ నెల తొమ్మిదో తేదీన అర్ధ వీడు మండలం, అర్ధవీడు గ్రామంలో తొమ్మి దేళ్ల బాలిక శాన్విరెడ్డి హత్యకు గురైన విషయం విదితమే.. తొలుత హత్య ఎవరో దుండగులు చేసి ఉంటారని ప్రచారం జరిగింది. పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. ఈ కేసు విషయమై మార్కాపురం డిఎస్పి బాలసుందరరావు తమ సిబ్బందితో కలిసి వేర్వేరు బందాలుగా విచారణ జరిపారు. అర్ధ వీడు మండలంలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న పుచ్చకాయల వెంకటరమణారెడ్డి, లక్ష్మీ పద్మావతి దంపతులకు సంతానం లేకపోవ డంతో రమణారెడ్డి తన అన్న అయిన వెంకట రంగారెడ్డి కుమార్తెను తొమ్మిదేళ్ల కిందట దత్తతకు తీసుకున్నాడు. ఇటీవల శాన్విరెడ్డి కన్న తల్లిదండ్రులకు, పెంచిన తల్లిదండ్రులకు ఆస్తుల విషయంలో గొడవలు జరిగాయి.కన్న తల్లిదండ్రులు కూడా శాన్విరెడ్డిని ప్రేమగా చూస్తుండడంతో, రమణారెడ్డి, లక్ష్మీపద్మావతి దంపతులు ఓర్వలేకపోయారు. తాము ఇన్నా ళ్లూ పోషించిన శాన్విరెడ్డి తల్లిదండ్రులకు దగ్గర కావడం, పైగా ఆస్తి కూడా మొత్తం శాన్విరెడ్డికే రాసి ఇవ్వాల్సి వస్తుందని ఓర్వలేక బాలిక గొంతు కోసి హత్య చేశారని ▶ 2లో

కార్యకర్తలను కాపాడుకొనేదెలా.?

- జగన్‌పై దుమ్మెత్తిపోస్తున్న ఎన్ఆర్ఐలు
- వైసిపి నేతల్లో ఇప్పుడు ఇదే తీవ్ర ఆందోళన
- ఐదేళ్లూ పట్టించుకోకుండా.. ఇప్పుడు బేలమాటలా.?

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కార్యకర్తలను కాపాడుకోవడం ఎలా? భవి ష్యత్‌లో వారిని పార్టీకి సైనికుల్లా పనిచేయిం చడం ఎలా? వారి విశ్వాసం తిరిగి పొందడం ఎలా? అన్నదానిపై ఇపుడు వైసిపి నేతల్లో తీవ్ర అలజడిగా ఉంది. వారిని ఐదేళ్లూ నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇప్పుడు ఎన్నికల్లో గట్టిగా పోరాడలేకపోయారనే చర్చ సాగుతోంది. వైసిపి ఓటమి కారణాల్లో అనేకం వెలుగులోకి వస్తున్నాయి. అభ్యర్థులు కొన్ని కారణాలు చెబితే.. పార్టీ శ్రేయోభిలాషులు వారి ఆలోచన లను వెల్లడిస్తుంటే.. వైసిపి సానుభూతి పరులుగా ఉన్న ఎన్ఆర్ఐలు మాత్రం వైసిపి అధినేత జగన్‌పైనే సోషల్‌మీడియాలో దుమ్మెత్తిపోస్తున్నారు. కార్యకర్తలను కాపాడు కోవడంలో వైఫల్యం కాదని.. వాళ్లను ఏమాత్రం పట్టించుకోలేదని తీవ్రంగా ధ్వజమెత్త తున్నారు. పార్టీ కోసం కష్టపడి.. గ్రామాల్లో అన్నీ పోగొట్టుకున్న వారిని పట్టించుకోకుండా అధి నాయకత్వం కోటరీగా మారి రూ.కోట్లు సంపాదించుకొని.. సరదాలు తీర్చుకున్నారనే విమర్శలు చేస్తున్నారు. ఆస్ట్రేలియా నుంచి ఓ అభిమాని విడుదల చేసిన వీడియోలో జగన్‌ను తీవ్రంగా తప్పుపట్టారు. భవిష్యత్‌లో ఆయన వెంట ఎవరూ ఉండవద్దని హితవు పలికారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో తీవ్ర వైరల్‌గా మారింది. కార్యకర్తలను ఏనాడూ పట్టించుకోలేదని పంచ్‌ప్రభాకర్ కూడా ధ్వజ మెత్తారు. ఇదే కొంపముంచిందని హెచ్చరిం చారు. ఇప్పుడు ఇవన్నీ వైసిపి నేతల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. లెక్కింపు రోజునే పరిస్థితిని తట్టుకోలేక అభ్యర్థులు అందరూ జిల్లా విడిచిపోయారు. హైదరాబాద్‌లో ఉన్నా రు. గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలే మిగిలారు. మరోవైపు ప్రతీకారేచ్ఛ రగులుతోంది. ఐదేళ్లూ కొందరు నేతలు తెలుగుదేశం నేతలపై చేసిన ఆరోపణలు, ట్రోలింగులు, బూతులు, దూషణ లకు ఆ పార్టీ కార్యకర్తలు మదనపడ్డారు. ఇప్పుడు అవకాశం వచ్చిందని వైసిపి కార్యకర్తలపై రెచ్చిపోతున్నారు. అప్పుడు ఎవరైతే సోషల్‌మీడియాలను వేదికగా చేసుకొని సవాళ్లు విసిరి రెచ్చిపోయారో వాళ్లంతా ఇప్పుడు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నేతల కోసం కార్య కర్తలు ఇలా బలయ్యారు. పోటీ చేసిన నేతలందరూ బాగానే ఉన్నారు. అంతా సేఫ్‌గానే ఉన్నారు. ఇప్పుడు మధ్యలో నలిగి పోతోందెవరంటే కార్యకర్తలే.. వీళ్ల పరిస్థితి ఏమిటన్నదే ప్రశ్నగా మారింది. ఇక ఓటమికి ప్రధాన కారణం కూడా పార్టీ కోసం ఇంత గట్టిగా పోరాడుతున్న కార్యకర్తలను పట్టిం చుకోక పోవడమేనంటున్నారు. కారణాలేమైనా వైసిపి శ్రేణుల్లో గత ఎన్నికల నాటి పోరాట పటిమ లేదు. వారికి తగిన ప్రోత్సాహం లేదు. గుర్తింపు ఆదరణలేక నిర్వీర్యంగానే ఉన్నారు. నిరుత్సాహంతోనే పనిచేశారు. అందరిలోనూ ఏదో పైకి చెప్పలేని అసంతృప్తి.. ఎన్నికల్లో చెమటోడ్చి పోరాడాలనే భావన కూడా లేదు. ఏదో పార్టీ కోసం అన్నట్లుగా.. గ్రామాల్లో పరువు ప్రతిష్ట కోసం అన్నట్లుగా పనిచేశారు. ఇంకా చెప్పాలంటే కార్యకర్తలు చాలా చోట్ల సాదాసీదాగానే పనిచేశారు. అభ్యర్థుల గెలుపు కోసం తాడోపేడో తేల్చుకోవాలనే భావనలో కనిపించలేదు. ఎందుకంటే ఎమ్మెల్యేలు, మంత్రులు.. తాడేపల్లిలోని కోటరీలే రూ.కోట్లు సంపాదించుకున్నారనే ▶ 2లో

రైతులకు భరోసా ఇవ్వని కేంద్రాలు

- అన్నదాతలకు ఉపకరించని వైనం
- నూతన ప్రభుత్వంలో అయినా రైతులకు కేంద్రాలు చేరువయ్యేనా.?

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అన్ని విధాలా రైతన్నలకు అండగా ఉం డేందుకు రైతులకు వారి ఇంటి వద్దనే సేవ లందించేందు కోసం రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల ఉద్దేశం ఆచ రణలో నెరవేరుతున్న పరిస్థితి కనిపించడం లేదు. రైతులు పంట సాగు మొదలుపెట్టిన దగ్గర నుంచి తాము పండించిన పంటలకు కనీస మద్దతు ధర లభించేంత వరకు అన్ని విషయాలలోనూ పూర్తి సహకారం కోసం రాష్ట ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను తెచ్చింది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటయిన సచి వాలయ వ్యవస్థకు అనుబంధంగా రైతుభరోసా కేంద్రాలు వచ్చాయి. రైతులు సాగు మొదలు పెట్టిన సమయంలో భూసార పరీక్షల నుంచి పంట సాగులో మెళకువలు తెలియజేయడం, రైతులకు కావలసిన సమగ్ర సాంకేతిక పరిజ్ఞానం అందించడం, యంత్ర సామాగ్రిని అందించడం, వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు రైతుల వద్దకు చేరేలా చూడడమే రైతు భరోసా కేంద్రాల ముఖ్య ఉద్దేశం.

మూడేళ్లుగా అరకొరగా భూసార పరీక్షలు

పంట దిగుబడులు తగిన నాణ్యతతో బాగా రావాలంటే ముందుగా భూసార పరీక్షలు అవసరం. రైతాంగం పొలం బాట పట్టడానికి ముందు గ్రామాల వారీగా భూసార పరీక్షలు జరపాలి. పంటల సాగుకు ఇది కీలకం. పంట ప్రారంభానికి ముందు మట్టి నమూనాల సేకరణ జరిపి సాగు భూమిలో ఏవి లోపించాయో తెలుసుకుని తదనుగు ణంగా ఎరువులు వాడాలి. కానీ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి వచ్చా క గడచిన నాలుగేళ్ళలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూసార పరీక్షలు జరిపింది లేదు. భరోసా కేంద్రాల్లో భూసార పరీక్షలకు సంబంధించిన పరికరాలు సమకూరలేదు. కొన్ని చోట్ల ఉన్నా అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ కారణంగా భూసార పరీక్షలు రైతులకు అందుబాటులోకి రాలేదు.

నిరుపయోగంగా డిజిటల్ కియోస్కులు

రైతు భరోసా కేంద్రాల్లో డిజిటల్ కియోస్కలను ఏర్పాటుచేశారు. ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దిన ఈ పరికరం ద్వారా రైతులు తమకు కావలసిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఇతర వ్యవసాయ ఉత్పాదకాలను తమ గ్రామం నుంచే ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేసి పొందవచ్చని చెప్పారు. పంటల సాగులో నూతన పద్ధతులను ఇక్కడి వీడియోల ద్వారా చూడవచ్చన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కాకుండా పాత రెవెన్యూ గ్రామాలను ప్రాతిపదికగా తీసుకొని వీటిని ఏర్పాటు చేశారు. కానీ డిజిటల్ కియోస్కలు ఎక్కడ కూడా రైతులకు ఉపయోగపడిన దాఖలాలు లేవు. రైతులు ఆర్‌బికెలకు వెళ్లి తమకు కావలసిన ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయవచ్చని, రైతులు ముందుగా తమకు ఏమీ కావాలో చెబితే వాటిని తెప్పించి ఇస్తామని చెప్పారు. రైతులు ముందే నగదు మొత్తం చెల్లించి వాటిని తీసుకోవలసి ఉంటుందన్నారు. సాధారణంగా రైతులు సీజన్‌లో తమకు తెలిసిన షాపుల వారి నుంచి ఎరువులు, పురుగుమందులు అరువుకు తెచ్చుకొని.. పంట వచ్చాక అమ్మి చెల్లింపులు జరుపుతారు. కానీ ఆర్‌బికెల్లో అలా కుదరదు. ఎవరైనా ముందుగానే నగదు చెల్లించి తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా పురుగు మందుల విషయంలో రైతులు అప్పటికప్పుడు పంటపై వాడాల్సి ఉంటుంది. ఇలా ముందుగా ఆర్డర్ పెట్టి అవి వచ్చాక కొని పంటపై చల్లడం అనేది ఆచరణలో కుదిరేది కాదు కనుక డిజిటల్ కియోస్కలు రైతులకు ఉపయోగ పడింది లేదు.

రైతులకు చేరని వ్యవసాయ పరికరాలు

మండలాల వారీగా రైతులను గ్రూపు లుగా చేసి వారికి రాయితీతో ▶ 2లో

నకిలీ వి(ప)త్తు.!

- జోరుగా నాసిరకం విత్తనాల వ్యాపారం
- నష్టపోతున్న రైతాంగం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అధికారుల నిఘా నామమాత్రంగా ఉండ టంతో హైబ్రిడ్ పత్తి విత్తనాల పేరుతో నకిలీ విత్తనాల వ్యాపారం జోరుగా సాగు తోంది. యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాం తకం మండలాల్లోని రైతాంగం ఈ నకిలీ విత్త నాల మాయలోపడి నిలువునా మునిగి పోతున్నారు. పలువురు వ్యాపారులు తమకు లైసెన్సు లేకపోయినా కల్తీ విత్తనాలు తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. చిలకలూరి పేట, పేరేచర్ల, రెంటచింతల, నంద్యాల, కర్నూ లు కేంద్రాలుగా చేసుకొని నకిలీ విత్తనాలు సర ఫరా చేస్తున్నట్లు సమాచారం. విపణి వీధి లో గిరాకీ ఉన్న పత్తి విత్తనాల ప్యాకెట్లను పోలిన విధంగా ఆకర్షణీయమైన లేబుళ్లతో నకిలీ విత్త నాలను తయారుచేసి కారుచౌకగా అమ్ము తున్నారు. గత ఏడాది ఆశించినంతగా మేలు జాతి విత్తనాల ఉత్పత్తి లేనందున సీడ్‌ప్లాంట్ల యజమానులు దళారులతో కుమ్మక్కై సంపూర్ణ జెర్మరేషన్ లేని విత్తనాలను కూడా కలిపి అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిసింది.

చట్ట ప్రకారం హైబ్రిడ్ విత్తనాలను..

చట్టప్రకారం హైబ్రిడ్ విత్తనాలను తయా రు చేసి అమ్మకాలు జరపాలంటే విజయవాడ, హైదరాబాదు, నంద్యాలలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సీడ్ సర్టిఫికేషన్ ఏజన్సీల అనుమతి పొందాల్సి ఉండగా అలాంటి నియమాలేవీ పాటించక పోవడం ఇక్కడి ప్రత్యేకత. హైబ్రిడ్ విత్తనాలు తయారు చేసే కంపెనీలు రైతులకు ఆడ, మగ విత్తనాలు సరఫరా చేస్తారు. విత్తిన తరువాత సర్టిఫికేషన్ ఏజెన్సీకి వివరాలు అందిస్తారు. విత్తనాలు మొలకెత్తిన 40 రోజుల తరువాత సర్టిఫికేషన్ ఏజెన్సీ, విత్తన నాణ్యత నిపుణులూ ఆయా విత్తన ఉత్పత్తి క్షేత్రాలను పరిశీలించి నాణ్యతలేని మొక్కలను తొలగిస్తారు. ఈ క్షేత్రాలకు 30 మీటర్ల దూరంలో ఇతర రకాల పత్తి లేకుండా చూడటం, సంకర పరిచే విధానాన్ని పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలను ఏజెన్సీలు నిర్వహించాలి. విత్తనాలు తయారైన తరువాత వాటి నాణ్యత పరిశీలించేందుకు ఏజెన్సీ గ్రోవర్ పరీక్ష నిర్వహించి విత్తన నాణ్యత శాతం, మొలక శాతం అధికంగా ఉన్న విత్తనాలను మార్కెట్‌లో అమ్ముకునేందుకు సర్టిఫై చేస్తుంది.

నకిలీ విత్తన వ్యాపారులు ఇలా..

నకిలీ విత్తనాల వ్యాపారులు ▶ 2లో

కార్యకర్తలను కాపాడుకొనేదెలా.?

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు కార్యకర్తల నుంచి వస్తున్నాయి. ఆదాయాలన్నీ వాళ్లే పొందారు. పార్టీ కోసం వీధిలో నిలబడే కార్యకర్తలను మాత్రం గాలికి వదిలేశారనే విమర్శలు సొంతపార్టీ నేతలే చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వైసిపి కార్యకర్తలను భవిష్యత్‌లో కాపాడుకోవడం ఎలా? వారిని నిలుపుకోవడం ఎలా అన్నది ఇప్పుడు పోటీచేసిన అభ్యర్థులకు సవాలుగా మారింది. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు గాలికి వదిలేసి.. ప్రతిపక్షంలోకి వెళ్లాక అంటే ముళ్లబాటలోకి వచ్చాక వాళ్ల గురించి ఆలోచించడం అంటే పార్టీనాయకత్వ చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తోంది. కార్యకర్తలను అన్ని రకాలుగా కాపాడుకోవడం ఇప్పుడు సవాలుగానే మారనుంది. లేకుంటే పార్టీ పునాదులే గల్లంతవుతాయనే హెచ్చరికలు కూడా వస్తున్నాయి. ఏదేమైనా వైసిపి నాయకత్వానికి ఇప్పుడు అగ్ని పరీక్ష మొదలైంది.

పెంచిన చేతులే గొంతు కోశాయి..

(మొదటిపేజీ తరువాయి)

డీఎస్పీ తెలిపారు. ఆరో తేదీ మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పుచ్చకాయల లక్ష్మీపద్మావతి బెడ్‌రూమ్‌లో ఫోన్ చూసుకుంటున్న శాన్విరెడ్డి ముఖంపై దిండుతో గట్టిగా నొక్కి పట్టి.. కత్తితో గొంతు కోసి హత్య చేసింది. ఆ సమయంలో వెంకటరమణారెడ్డి గేటు వద్ద నిలబడి ఎవరైనా వస్తారేమోనని కాపలాగా నిలబడ్డాడు. అనంతరం ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు శాన్విరెడ్డిని హత్య చేశారని చుట్టుపక్కల వారిని నమ్మించే ప్రయత్నం చేశారు. పోలీసులు విచారణ చేసి.. వెంకటరమణారెడ్డి, లక్ష్మీపద్మావతిలను నిందితులుగా తేల్చారు. వీరిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా విచారణ చేసి.. అసలు నేరస్తులను గుర్తించి.. అరెస్టు చేసిన కంభం సీఐ జె.రామకోటయ్యతో పాటు కంభం సర్కిల్‌లోని ఎస్‌ఐలను డీఎస్పీ బాలసుందరరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సిఐ జె.రామకోటయ్య, కంభం ఎస్‌ఐ పులి రాజేష్, అర్ధవీడు ఎస్సై ఎం అనిత, బేస్తవారిపేట ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.

రైతులకు భరోసా ఇవ్వని కేంద్రాలు

(మొదటిపేజీ తరువాయి)

కూడిన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా వీలు కల్పించారు. గ్రామం యూనిట్‌గా ఏర్పాటు చేసిన రైతు గ్రూపులకు రూ.15 లక్షల పైన విలువ గల పరికరాలు ఇస్తామని చెప్పారు. ట్రాక్టర్లు, నాగళ్ళు,నూర్పిడి యంత్రాల లాంటి వాటిని రైతులు కొనుక్కోవచ్చు. ఈ పథకంగా కూడా చేరువకాలేక పోయింది. కొంత మేర రైతులను గ్రూపులుగా చేసినా సదరు పరికరాల కొనుగోలు కోసం కావలసిన నిధులు ప్రభుత్వం నుంచి సక్రమంగా వచ్చిన దాఖలు లేవు. అలానే సదరు పరికరాలు మార్కెట్ ధర కన్నా కొన్నిసార్లు ఎక్కువగా ఉండటం, ముందుగానే మొత్తం నగదు చెల్లించడం లాంటి షరతుల వల్ల ఈ వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలు పథకం రైతులకు ఉపయోగపడలేదు.

ఆర్‌బికేల్లో అందుబాటులోకి రాని బ్యాంకింగ్ సేవలు

రైతులకు అవరమైన బ్యాంకింగ్ సేవలను ఆర్‌బికేల ద్వారా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం బ్యాంకింగ్ కరస్పాండెంట్లను (బిసిలు) ఆర్‌బికేల్లో నియమించి వారి ద్వారా రైతులకు సులభతరంగా రుణాలు ఇప్పించాల్సి ఉంది. కానీ జిల్లాలో ఎక్కడా కూడా ఆర్‌బికేల ద్వారా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చిన దాఖలాలు లేవు. ఈ బిసిలు ఆర్‌బికేల్లో రోజులో కొన్ని గంటలు ఉండడం ద్వారా రైతులు ఆన్‌లైన్‌లో నగదు జమలు, కొద్దిపాటి రుణం పొందడం సాధ్యపడేది. జిల్లాలోని ఏ ఒక్క ఆర్‌బికేలో కూడా ఈ సౌకర్యం అందుబాటులోకి రాలేదు. ఇలా పలు రకాల కారణాలతో రైతు గడప వద్దనే సేవలందించేందు కోసం ఏర్పాటయిన రైతు భరోసా కేంద్రాలు ప్రభుత్వం చెప్పిన విధంగా రైతులకు చేరువకాలేక పోయాయి. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి అయినా రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరం అయిన సేవలు పూర్తి స్థాయిలో అందేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. నూతన ప్రభుత్వంలో అయినా ఆర్‌బికేలను రైతులకు అండగా నిలపాల్సి ఉంది.

వసతిగృహాల్లో సీట్లు భర్తీ చేయాలి

మార్కాపురం ఎఎస్‌డబ్ల్యుఓ ఎన్‌వి.అరుణకుమారి

మాట్లాడుతున్న అరుణకుమారి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని మార్కాపురం ఎఎస్‌డబ్ల్యుఓ ఎన్‌వి అరుణకుమారి కోరారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్‌తో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి మొదలవుతున్నందున యర్రగొండపాలెం మండలంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాల అడ్మిషన్లు వంద శాతం భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వసతి గృహాల్లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎస్సీ-70, హెచ్‌సి-12, బిసి-9, ఎస్టీ-5, ఓసి-4 నిష్పత్తిన వసతి గృహాలలో ప్రభుత్వం ప్రవేశాలు కల్పిస్తోందన్నారు. అందుచేత ఎస్సీ, ఎస్టీ, బిసి కాలనీలను సందర్శించి విద్యార్థులు వసతి గృహాల్లో చేరేలా కృషి చేయాలన్నారు. విద్యాదీవెన, వసతిదీవెన దరఖాస్తులు పెండింగ్ లేకుండా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు గాలి వెంకటేశ్వరరెడ్డి, షేక్ యాసిన్‌బేగంతోపాటు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఆయా హాస్టల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

తీవ్రమైన దోమల బెడద • అనారోగ్యం బారిన ప్రజలు

డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని డ్రైనేజీ కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో దోమల బెడద తీవ్రమై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పట్టణంలో సైడ్ కాలువలు సక్రమంగా లేకపోవడం, ఉన్నవి మరమ్మతులకు గురి కావడంతో చెత్తా చెదారంతో పేరుకుపోయాయి. దీనికి తోడు శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు ముందుకు కదలక నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల బెడద తీవ్రమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాలువలో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, ఇకనైనా అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువల్లోని చెత్తా చెదారం తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీ వి(ప)త్తు.!

(మొదటిపేజీ తరువాయి)

హైబ్రిడ్ విత్తనాలు వేసిన తరువాత వచ్చే పత్తి నుంచి తీసే ఎఫ్-1 విత్తనాలను ప్యాకింగ్ చేస్తారు. ఈ రకమైన విత్తనాలను నాటితే మొలక, ఆకులు, కొమ్మల నిర్మాణం, మొక్క రంగు, రూపం నాణ్యమైన సర్టిఫైడ్ విత్తనాల నుంచి వచ్చే మొక్కల మాదిరిగానే ఉండటంతో కాపుకు వచ్చే వరకు రైతులకు అర్థం కాదు. దీన్ని ఆసరాగా తీసుకొని నకిలీ విత్తనాలను ఇబ్బడిముబ్బడిగా తయారు చేసి రైతులను దెబ్బతీస్తున్నారు. ఎఫ్-1 పత్తిని జిన్నింగ్ చేసి గాఢ గంధకికామ్లంలో శుద్ధిచేసి 450 గ్రాముల చొప్పున ప్యాకింగ్ చేస్తారు. దీనికి 50 రూపాయలు మాత్రమే ఖర్చువుతుంది. దళారులు ఈ విత్తనాల సంచికి సర్టిఫైడ్ విత్తనాల కంటే రూ.100 తగ్గించి అమ్ముతారు. ఈ దళారులు అనేక గ్రామాల్లో సంచరిస్తూ నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. వాయిదాల పద్ధతిలో విక్రయించి మొక్క మొలకెత్తిన నాటినుంచి రైతుల చుట్టూ తిరుగుతూ ఒత్తిడి తెచ్చి మరీ డబ్బులు వసూలు చేసుకొని పోతుంటారు. అధిక వర్షాలు, వర్షాభావం, పురుగు ఉధృతి, తదితరాలపై పత్తి దిగుబడులు ఆధారపడి ఉంటాయి.

దిగుబడులు తగ్గితే..

నకిలీ విత్తనాలు వాడిన రైతులు దిగుబడులు తగ్గితే పై కారణాలలో ఏదో ఒకటి జరిగి ఉంటుందని భావించడం నకిలీ విత్తన వ్యాపారులకు వరంగా మారింది. నాణ్యత లోపించిన విత్తనాల గురించి రైతులు ఆలోచించలేక పోతున్నారు. దీంతో ఎకరాకు ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి సాధించలేకపోతున్నారు. ముడి విత్తనాలను కూడా రైతులకు మాయమాటలు చెప్పి అంటగడుతున్నారు. వీటిని విత్తిన రైతులకు కూడా నష్టాల దిగుబడి తప్పడం లేదు. గ్రోవర్ పరీక్షలో విఫలమైన విత్తనాలను కూడా వ్యాపారులు సీడ్ ప్లాంట్ల యజమానుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఈ ప్రాంత రైతులకు అంటగడుతున్నారు. ఈ నకిలీ విత్తనాల కారణంగా ఆరుగాలం కష్టించినా దిగుబడులు రాక రైతన్న నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు.

రహదారిపైకి మురుగునీటి కాలువ

దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులు

ఆర్‌అండ్‌బి రహదారిపై నిలిచిన మురుగునీరు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామ ఎస్సీ కాలనీ నుంచి వచ్చే మురుగు నీటి కాలువను ఆర్‌అండ్‌బి రహదారిపైకి వదిలేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఆ కాలనీలోని మురుగు నీరంతా రహదారిపై చేరుకొని నెలల తరబడి కొనసాగుతుండడం ఇబ్బందికరంగా మారింది. పల్లె వెలుగు బస్సులు ప్రయాణించేది ఆ మార్గంలోనే. వాహనాల రాకపోక సమయంలో చాలా కాలంగా నిలిచిన మురుగు నీరు అటుఇటుగా కదలడంతో కంపు కొడుతోంది. ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారిలో ఈ విధంగా ఉన్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిలిచిన మురుగు నీటితో కంపు ఒక్కటే కాదు... దోమలు కూడా ఉత్పత్తి అవుతున్నాయి. సమీపంలోని ప్రజలకు కంపుతో పాటు దోమపోటు కూడా అధికంగా ఉంది. ఇదే విధంగా కొంతకాలం మురుగునీరు నిలిచినట్లయితే ప్రజలు అనారోగ్యంతో బాధపడక తప్పదు. మురుగు నీటిని రహదారిపైకి రాకుండా మళ్లిస్తే తప్ప ఈ సమస్య తీరదు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షపునీటితో నిండిన రహదారి

వర్షానికి జలమయమైన రహదారులు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో శుక్ర, శనివారల్లో రెండుసార్లు భారీవర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం పది రోజులుగా అడపాదడపా పడుతున్న వర్షంతో ఉక్కపోత నుంచి పెద్దగా ప్రజలకు ఉపశమనం కలగకపోగా శుక్రవారం పడిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. గ్రామాలలో అక్కడక్కడా రైతులకు పదును వర్షం పడటంతో అన్నదాతలు పొలం పనులపై దృష్టి పెట్టారు. అయితే పట్టణంలో శనివారం కూడా వర్షం పడింది. ఇలా పడుతున్న కొద్దిపాటి వర్షానికి ప్రధాన రహదారితో పాటు పట్టణంలోని వీధులు పూర్తిగా మురుగు నీటితో నిండి పాదచారులు, వాహణ చోదకులు అవస్థలు పడుతున్నారు. అయినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఆటో బోల్తా పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఆటో బోల్తా పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని పందువ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై శివ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెరుగుపల్లికి చెందిన పలువురు కంద్రిక వెళ్లి తిరిగి ఆటోలో వారి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న కత్తి పౌల్ (70) మృతి చెందగా మరో ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కనిగిరి వైద్యశాలకు తరలించారు.

CHANGE OF NAME & D.O.B

I, **SHAIK MOHAMMED BASHA**, S/o. **Shaik Khadar Buday**, aged : 50 years, Resident of D.No.37-2-18, Islampet-1, Ramanna Pet, Ongole, Prakasam District, Andhra Pradesh. Aadhaar No.450869009248, my mother name wrongly entered as **JAHIDA SHAIK** instead of **SHAIK JAHIDA BEGUM** and my son name as **SHAIK MOHAMMED SAFWAN** instead of **SHAIK MOHAMMED BASHA** and date of birth **01-01-2008** instead of **04-01-2009** as per affidavit dated 08-06-2024 before public Notary, Ongole.

CHANGE OF NAME

I, **S RANGA LAKSHAMMA** is legally Mother of No: **16131435F**, Rank: **L/NK**, Name: **SOMA GANGADHAR**, Unit: 2 ENGR REGT C/O 56APO, resident of Village & PO : **Donakonda**, Ardhaveedu Mandal & Tehsil, Prakasam District - 523336, Andhra Pradesh. have changed my Name from **S RANGA LAKSHAMMA** to **SOMA RANGA LAXMAMMA** As per affidavit dated 08-06-2024 before public Notary,Giddalur.

CHANGE OF NAME

I, **S CHALAMAIAH** is legally Father of No: **16131435F**, Rank: **L/NK**, Name: **SOMA GANGADHAR**, Unit: 2 ENGR REGT C/O 56APO, resident of Village & PO : **Donakonda**, Ardhaveedu Mandal & Tehsil, Prakasam District - 523336, Andhra Pradesh. have changed my Name from **S CHALAMAIAH** to **CHALAMAIAH SOMA** As per affidavit dated 08-06-2024 before public Notary,Giddalur.

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా మరియు సెషన్సు జడ్జి వారి కోర్టు, కాకినాడ

I.A. No.1663/2019
ASSR No.1538/2018

Between:
గంటా వీరభద్రం & others
...పిటిషనర్స్/అప్పిలెంట్స్
మరియు
తోట తులసీరత్నం & 10 others
...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్

8వ రెస్పాండెంట్: గంటా వెంకట శ్రీనివాస్, S/o. వీర వెంకట సత్యనారాయణ మూర్తి, డో.నెం.4-59, కొత్తపేట బజారు, చీమకుర్తి, ప్రకాశం జిల్లా.

ఈ నెంబరు అప్పీలు వ్యాజ్యంలో 8వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసు సమన్లు పంపించినను అందుకొనక Evoid చేయు చున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది.**19-06-2024** సం॥రం తేదీన ఉదయం గం.**10.30** ని॥ల లగాయతు మీరు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై, మీ సంజాయిషీ చెప్పుకొని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానింతురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

భమిడిపాటి వెంకటరామశర్మ
D.V.S.S. సుజన
అడ్వకేట్స్, కాకినాడ
కాకినాడ
ది.2-6-2024
సెల్: 9246589838

ఏరియా వైద్యశాలలో మెరుగైన వసతులు

జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఎస్ఎన్ మూర్తి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఎస్ఎన్ మూర్తి తెలిపారు. శనివారం ఆయన యర్రగొండపాలెంలోని ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. నవజాత శిశుసెంటర్‌ను సందర్శించారు. అన్ని వార్డులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ వైద్యనిపుణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది తక్కువగా ఉంటే భర్తీ చేస్తామన్నారు. పేదలకు ప్రభుత్వ వైద్యశాలపై మరింత విశ్వాసం పెరిగేలా వైద్యసేవలు అందించాలని చెప్పారు. ఆసుపత్రిలో డైట్స్, శానిటేషన్, మందుల కొరత లేకుండా చూడాలని తెలిపారు. ఏ ఒక్క రోగి కూడా బయట మందులు కొనుగోలు చేయవద్దని చెప్పారు.

వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ఎన్ మూర్తి

నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందాలన్నారు. యర్రగొండపాలెంలోని ఏరియా వైద్యశాలకు 50 బెడ్లు మంజూరైనట్లు తెలిపారు. 5 డయాలసిస్ యూనిట్లు మంజూరు అయినట్లు తెలిపారు. వాటిని వేగవంతంగా ఆసుపత్రిలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఐసియు, డిహెచ్‌టియు యూనిట్లు అందుబాటులోకి రానున్నాయన్నారు. కంటి, ఎముకల విభాగాలు, ప్రసూతి, జనరల్ ఆపరేషన్లు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఏరియా వైద్యశాలలో శానిటేషన్ వర్కర్లు, ఆయమ్మలు తక్కువగా ఉన్నారని తెలపడంతో విషయాన్ని ఫోన్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంజూరు చేస్తామని ఉన్నతాధికారులు తెలిపినట్లు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవరయాదిద్య, వైద్యనిపుణులు డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ వినయ్, హెడ్‌నర్స్ పి మినిజోష్‌తోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయతీలో రెవెన్యూ అధికారుల అండదండలతో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ మట్టి మాఫియా రెచ్చిపోయి తమ అక్రమ మట్టి దందాను మూడు పువ్వులు-ఆరు కాయలుగా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. చెరువులు, కుంటల్లో నుంచి కోట్లాది రూపాయల విలువ చేసే మట్టిని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వం నోట్లో మట్టికొడుతున్నారు. అక్రమంగా మట్టి దందాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మట్టి మాఫియాతో కుమ్మక్కై అక్రమార్కులతో చేతులు కలుపుతున్న విమర్శలున్నాయి. అక్రమంగా మట్టిని తరలించి పెద్దమొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములను, చెరువులను పరిరక్షించాల్సింది పోయి అందుకు విరుద్ధంగా మట్టి తవ్వకాలను జరుపుతున్నట్లు చర్చించుకుంటున్నారు. గుత్తేదారులు యథేచ్ఛగా చెరువుల్లోని మట్టిని ప్రొక్లయినర్లతో తవ్వి రాత్రి సమయంలో ట్రాక్టర్లతో ఇటుక బట్టీలకు

అక్రమంగా రాత్రులలో మట్టి తరలిస్తున్న దృశ్యం

తరలిస్తున్నారు. మట్టి మాఫియా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతుండడంతో ఆ ప్రాంతంలో భారీ గోతులు పడి వర్షాకాలంలో వర్షపు నీరు గుంతల్లోకి చేరి లోతు తెలియక పలువురు ప్రమాదానికి గురై నీటమునిగి దుర్మరణం చెందుతున్న సంఘటనలు కూడా ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఇష్టారాజ్యంగా చేపడుతున్న మట్టి తవ్వకాలతో ఇబ్బందులు ఏర్పడుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మట్టి తవ్వకాలను అడ్డుకొని అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాట్లాడుతున్న జనసేన దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గరికపాటి వెంకట్

కూటమి విజయం ఆనందదాయకం: గరికపాటి

ప్రజాశక్తి-దర్శి: రాష్ట్రంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి కూటమి విజయం సాధించటం ఆనందదాయకమని దర్శి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి గరికపాటి వెంకట్ అన్నారు. దర్శిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసైనికులు, వీర మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం శుభ పరిణామమన్నారు. జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పోటీ చేసిన 21 స్థానాలు గెలవడం ఇది ఒక చరిత్ర అన్నారు. పవన్ కళ్యాణ్ మీద నమ్మకంతో ప్రజలందరూ ఆయనకు ఓట్లేశారన్నారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలో జన సైనికులకు, వీర మహిళలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను గతంలో హామీ ఇచ్చినట్లుగా దర్శిలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తానన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

రామోజీరావు రాజకీయ భిక్ష పెట్టారు: కందుల

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

తనకు రాజకీయ భిక్ష పెట్టింది రామోజీ గ్రూపుల చైర్మన్, ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావేనని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం రామోజీరావు మరణవార్త విని తన కళ్లు చెమ్మగిల్లాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ రామోజీరావు మరణం తనను తీవ్రంగా కలచి వేసిందని అన్నారు. ఆయన ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని కొనియాడారు. కొన్ని వేల మందికి ఉపాధి కల్పించి ఆదర్శప్రాయుడిగా చరిత్ర పుటలలో నిలిచారని అన్నారు. 2004 ఎన్నికల ముందు కంభంపాటి కంభంపాటి రామ్మోహన్‌రావు ద్వారా రామోజీరావును కలిశానని, రాజకీయాల్లో ఎన్నాళ్లు ఉన్నామనేది ముఖ్యం కాదని, ప్రజలకు ఎంత సేవ చేసి దగ్గరయ్యామా అన్నదే ముఖ్యమని చెప్పి ఎంతో విలువైన సలహాలను ఇచ్చారని అన్నారు. అంతేకాక తన ఉత్సాహాన్ని చూసి రాజకీయాల్లో తప్పక రాణిస్తావని ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

దర్శి: ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు సాధారణ వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి అసాధారణ వ్యక్తిగా ఎదిగి

దర్శిలో రామోజీరావుకు నివాళి అర్పిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

తెలుగు ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారని టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం రామోజీరావు చిత్రపటానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ కలమే ఆయుధంగా సమాజంలో చైతన్యం నింపేందుకు రామోజీరావు అహర్నిశలు శ్రమించారని, జర్నలిజంలో కొత్త ఒరవడిని సృష్టించారని అన్నారు. రామోజీ రావులేని లోటు తీరనిదన్నారు. ఆయన మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, బిజెపి నాయకులు శ్రీను, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తెలుగుదేశం నాయకులు మారెళ్ల వెంకటేశ్వర్లు, జూపల్లి కోటేశ్వరరావు, దారం సుబ్బారావు, వైస్ చైర్మన్ గన్నెపూడి స్టీవెన్, శోభారాణితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

మార్కాపురం: ఈనాడు తెలుగు దిన పత్రిక అధినేత రామోజీరావు మృతి చెందడం బాధాకరమని పలువురు టిడిపి నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు పత్రికా పరంగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి, ఎమ్మెల్యే కందుల సోదరుడు కందుల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి కొండపి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పూలమాల వేసి నివాళ్ళర్పించారు. రామోజీ అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. అక్షర యోధుడు చెఱుకూరి రామోజీరావు తెలుగు రాష్ట్రాలకు, తెలుగు ప్రజల జీవితాలలో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం పని చేశారన్నారు. ప్రజా సమస్యలపై పోరాటంలో ఆయనే తనకు స్ఫూర్తి అని రామారావు కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు ఈనాడు గ్రూపు సంస్థల సిబ్బందికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కొండచిలువను బంధిస్తున్న అటవీ శాఖ అధికారులు

సంగపేటలో కొండచిలువ కలకలం

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం సంగపేట గ్రామంలో శనివారం కొండచిలువ కలకలం రేపింది. స్థానిక రైతుకు చెందిన ఓ గడ్డివాము దొడ్డిలో పది అడుగుల కొండచిలువ కనిపించింది. దీంతో హడలిపోయిన గ్రామ ప్రజలు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ ఎఫ్ఆర్ఓ ప్రియాంక, డిఆర్ఓ రంగారెడ్డి కొండచిలువను సురక్షితంగా బంధించి స్థానిక నల్లమల అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. పాములు కనిపిస్తే వాటిని చంపకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని పాములను పట్టుకుని సురక్షితంగా అడవి ప్రాంతంలో విడిచిపెడతామని అటవీ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా

ప్రజాశక్తి-గిద్దలూరు

కంచర్ల కోటయ్య గౌడ్

తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కంచర్ల కోటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటు అవుతున్న సందర్భంగా నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఆదేశాల మేరకు తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడే ప్రభుత్వం బీసీలకు ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బీసీల ఆత్మ గౌరవం నిలబడేలా చూడాలని కోరారు.

సాయం అందిస్తున్న దృశ్యం

'మానవత'కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పొదిలి

స్థానిక ప్రముఖ వ్యాపారస్తులు, భవాని గ్రూప్ సంస్థల అధినేత పేర్ల శ్రీనివాసరావు పొదిలిలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. శనివారం మానవత సంస్థ చైర్మన్ ముప్పల పార్థసారథికి ఈ నగదును అందించారు. పొదిలిలో మానవత సంస్థ ఏర్పడిన తరువాత నిరుపేదలకు చేయూతనిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, భవిష్యత్‌లో ఇంకా మంచి కార్యక్రమాలు చేయాలని కోరారు. పొదిలి మానవత సంస్థ సభ్యులు వారికి అభినందలు తెలియచేశారు.

పౌష్టికాహారంతో రక్త హీనత నివారణ

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించుకోవచ్చని పుల్లలచెరువు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నాగార్జున అన్నారు. మండలంలోని కొమరోలులోని అంగన్‌వాడీ కేంద్రంలో సిహెచ్ఓ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలను శుక్రవారం ఆయన వివరించారు. డాక్టర్ నాగార్జునగౌడ్ మాట్లాడుతూ ఐరన్ అధికంగా లభించే ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అదేవిధంగా కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు.

కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో పనిచేసే కూలీలకు ఎక్కువ రోజులు పని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, కనీస వేతనం రోజుకు రూ.600 వచ్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు చేసే మండలంలోని పాత నందాయపాలెం, కొత్త నందాయపాలెం, యత్రాయవారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పనులు పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎక్కువ మందికి వంద రోజులు పని కల్పించాలని కోరారు. అయితే ఎవరికీ వంద రోజులు పని కల్పించడం లేదని కూలీలు తమ దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ

కూలీలతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్

రంగంలో యంత్రాలు రావడం వల్ల వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందుకే ఉపాధి హామీ పథకం పీడీ, మండల స్థాయి అధికారులు చొరవ చూపి పనులు కనిపించాలని కోరారు. లేనిపక్షంలో కూలీలతో కలిసి ఆందోళన చేస్తామని అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు పెరుగుతున్న కనీస వేతనం పెరగక పోవడం దారుణమని అన్నారు. కేవలం రూ.300 లోపే ఇస్తున్నారని అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్లో కూడా ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తున్నారని అన్నారు. పేదల పట్ల చిత్తశుద్ధి ఉంటే నిధులు పెంచి ఉపాధి హామీ కూలీలకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఉపాధి కూలీలు ఇచ్చిన సౌకర్యాలను పునర్ధించాలని అన్నారు. గతంలో పలుగు, పారా ఇచ్చే డబ్బులు, మేట్లకు ఇచ్చే డబ్బులు ఇవ్వాలని అన్నారు. రెండు పూట్ల ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. 200రోజులు పని కల్పించేందు కోసం కూలీలంతా ఐక్యంగా ఉండాలని, ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడం కోసం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్లు శ్రీనివాసరావు, శివ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన మామిడిపాక హరిప్రసాదరావు

లోకేష్‌ను కలిసిన మామిడిపాక

ప్రజాశక్తి - పర్చూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎంఎల్ఎ నారా లోకేష్‌ను మంగళగిరిలోని ఆయన నివాసంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు మామిడిపాక హరిప్రసాదరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి, జనసేన కూటమి అఖండి విజయం సాధించడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షులు డూండీ రాకేష్ నివాసానికి వెళ్లి హరిప్రసాదరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆనందబాబును అభినందిస్తున్న నాయకులు

ఆనందబాబుకు అభినందనలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వేమూరు ఎంఎల్ఏగా గెలుపొందిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబును మండలంలోని ఐలవరం గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి గ్రామ అధ్యక్షుడు మాచర్ల నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు డోలా శివకుమార్, దీపాల శివప్రసాద్, వామనపల్లి కోటేశ్వరరావుతో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నారు. వేమూరు, అమర్తలూరు, కొల్లూరు మండలాల్లోని వివిధ గ్రామాల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆనందబాబును కలిసి శు భాకాంక్షలు తెలిపారు.

మాట్లాడుతున్న రవికుమార్

బీసీల మద్దతుతోనే కూటమి విజయం

ప్రజాశక్తి - బాపట్ల

బీసీలు పూర్తిస్థాయి మద్దతుతోనే టిడిపి కూటమి ఊహించని విజయం సాధించిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. న్యాయవాది అంగలకుదురు నటరాజన్ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ సంఘం టిడిపి కూటమి అభ్యర్థులకు పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామస్థాయి వరకు తమ సంఘం పనిచేయడంతో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించారని అన్నారు. నాలుగుసార్లు బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో పరాజయం పాలైన టిడిపికి ఈసారి బిసిల మద్దతుతో వేగేశన నరేంద్ర వర్మకు విజయం అందించినట్లు తెలిపారు. ఈసందర్భంగా రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరనిలోటని సంతాపం తెలిపారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు ఎన్ఎస్‌పి రాజు, మారం రవికుమార్, న్యాయవాది అగలకుదురు నటరాజన్, ఉప్పలదిన్నె గోపీనాథ్ పాల్గొన్నారు.

యూకే ఎన్నారైల ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - వేటపాలెం

జాంద్రపేట శివాలయంలోని కళ్యాణ మండపంలో యూకే ఎన్నారైలు బట్ట రవివర్మ, బట్ట రుద్రవర్మ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేసి జనసేన అధినేతకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాసిక వీరభద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు జనసేనని పవన్ కళ్యాణ్ చేసిన కృషి అమోఘం, అద్వితీయమని అన్నారు. పవన్ కళ్యాణ్ ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తిని అన్నారు. చేనేతలు చీరాలలో అధికంగా ఉన్నారని, వారి సమస్యల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. జనసేన మండల అధ్యక్షుడు ఉగ్గిరాల మార్కండేయులు మాట్లాడుతూ ప్రధాని మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ త్రిమూర్తులుగా వ్యవహరించి రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందించేందుకు కృషి చేశారని అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు సిద్ధి వెంకట బుచ్చేశ్వరరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ మాట తప్పని, మడమ తిప్పని వ్యక్తని కొనియాడారు. సమస్యలపై పోరాటంలో ఆయనకాయనే సాధ్యమని అన్నారు. చేనేత సమస్యల సాధన కోసం కృషి చేసి కొంతమేరకు విజయం సాధించారని అన్నారు. ఈ

అన్నదానం చేస్తున్న బట్ట మోహనరావు

సందర్భంగా పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 200 మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బట్ట మోహనరావు, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బట్ట మోహనరావు, జనసేన వీర సైనికులు బుద్ధి శ్రీహర్ష, మామిడాల శ్రీనివాసరావు, అనుమాలశెట్టి కిషోర్, వేటపాలెం పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు, జ్యోతిర్మయి దేవాంగ సంఘం అధ్యక్షుడు గౌరబతుని రవిబాబు, దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కూర్మా రాహుల్ జి, ఉపాధ్యాయులు పింజల శ్రీనివాసరావు, గుత్తి పరంజ్యోతి పాల్గొన్నారు.

రాజుపాలెం రోడ్డులో బిళ్లాకుతో బీడుగా మారిన పొలం

సాగుకు సిద్ధం

ప్రజాశక్తి - ఇంకొల్లు

రోహిణికార్తె గత నెల 25న వచిన్నప్పటి నుంచి విపరీతమైన వేడిగాలులు వీసినప్పటికీ ఇటీవల గత ఐదు రోజులుగా మారిన వాతావరణంతో రోజు మబ్బులు చేస్తున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని వివిధ మండలాలతో పాటు ఇంకొల్లు మండలంలో కూడా వర్షాలు ఒక మోస్తరుగా పడుతున్నాయి. మే నెల పోయి జూన్ నెల రావటంతో రైతులు తమ పొలాల్లోని వ్యర్థాలు తొలగిస్తూ మళ్లీ తొలకరి వానలకు ఖరీఫ్ పంట వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈపాటికి అక్కడక్కడ ట్రాక్టర్లతో నాగలి, గుంటక దుక్కులు దున్నటం రైతులు ప్రారంభించారు. పొలాల్లో ఈ కొద్దిపాటి వర్షాలకే బీళ్ళలకు, లింగం మిరియాల చెట్ల బెడద ఎక్కువగా ఉంది. మే నెల ఆఖరు వారం నుంచి కురుస్తున్న వర్షాలకు దుక్కి దున్ని పొలాల్లో గత ఏడాది మొక్కజొన్న, మిరప, పొగాకు సాగు చేసి నీటి తడులు ఇచ్చిన పొలాల్లో పిల్లాకు ఎక్కువగా ఉంది. పిల్లాకు పొలంలో ఒకసారి ఏర్పడి ఆకు ముదిరితే వాటి విత్తనం దాదాపు నాలుగేళ్ల వరకు వర్షాలు పడిన సమయంలో మొలుస్తూనే ఉంటాయని రైతులు అంటున్నారు. దీనికి తోడు శు క్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఈపాటికి బిళ్ళల్లాకు, లింగం మిరియాలు మొలిచిన భూముల్లో ఇంకా అవి బలపడి మరింత బీళ్లుగా మారతాయని రైతులు తెలిపారు. పిల్లఆకును ఈ ప్రాంతాల్లో గలిజేరాకు అనే పేర్లతో రైతులు పిలుస్తుంటారు.

కార్యకర్తల కృషితోనే భారీ మెజారిటీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నికల ముందు ఆనందబాబుకు ఇచ్చిన హామీ మేరకు భట్టిప్రోలు గ్రామంలో టిడిపికి మూడు వేల ఓట్లు మెజార్టీని సాధించడం గర్వకారణంగా ఉందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగించారని అన్నారు. గడచిన ఐదేళ్లు అభివృద్ధిని మరచి బటన్ నొక్కే పనులకే పరిమితం కావడంతో నేడు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని అన్నారు. గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో భట్టిప్రోలులో పది విడతలు పోరుబాట కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఎన్నికల ముందు గ్రామంలో వైసిపికి చెందిన 300 కుటుంబాలు ఒకేసారి టిడిపిలో చేరటం, అధికారులు, నాయకులు కలసి ఉపాధి హామీ పథకంలో చేసిన అవినీతిని ప్రజలకు వివరించడంతో ప్రజలు ఆలోచిం చారని అన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి, గతంలో టిడిపి ప్రభుత్వ కాలంలో జరిగిన అభివృద్ధిని ప్రజల వద్దకు తీసుకు వెళ్ళటం వంటి అనేక అంశాలతో ప్రజల్లో మార్పులు తీసుకువచ్చి టిడిపి వైపు ఆకర్షితులుగా చేయగలిగినట్లు చెప్పారు. పంచాయతీలో గడిచిన ఐదేళ్లలో రూ.6కోట్లు వివిధ రూపాల్లో నిధులుగా రాగా వాటిలో ఎలాంటి ఖర్చులు లేకుండానే పాలకవర్గం రూ.2.50కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతి అంశాలను కూడా ప్రజల దృష్టికి తీసుకువెళ్లడం టిడిపికి అనుకూలమైందని

సమావేశంలో మాట్లాడుతున్న తూనుగుంట్ల సాయిబాబా

అన్నారు. జగనన్న కాలనీలో గృహాలు నిర్మిస్తామని కాంట్రాక్టు తీసుకుని వాటిని పూర్తి చేయకుండా అవినీతికి పాల్పడటం, కాలనీల్లో కనీసం మౌలిక వసతులు లేకపోవడం వంటి పరిస్థితులను స్వయంగా పరిశీలించి ప్రజల స్థితిగతులను తెలుసుకొని వారికి టిడిపి గెలుపొందాక తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ పంచాయతీలో అవినీతితో పాటు మండల స్థాయిలో జరిగిన అనేక అవినీతి అక్రమా లపై ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయించి జరిగిన అవినీతి మొత్తాన్ని బయటికి తీసి చర్యలు తీసుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వైసిపి అరాచక పాలనలో టిడిపి కార్యకర్తల పై జరిగిన దాడులు, అక్రమ కేసులను కూడా ఎదుర్కొని దానికి తగిన ప్రతిఫలాన్ని అందిస్తానని హెచ్చరించారు. టిడిపి, జనసేన ఆధ్వర్యంలో రానున్న ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్, జంగం సాంసంన్, టైలర్ నాగేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

కొండయ్యను అభినందిస్తున్న పోస్టల్ ఉద్యోగులు

కొండయ్యను కలిసిన పోస్టల్ ఉద్యోగులు

ప్రజాశక్తి - చీరాల

ఎంఎల్ఎ మద్దులూరి మాలకొండయ్యను భారతీయ పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర కార్యదర్శి చుండి వెంకయ్య, పోస్టల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.

సత్యకు అభినందనలు తెలుపుతున్న ఈఓ

సత్యకు అభినందన

ప్రజాశక్తి-జరుగుమల్లి: కొండపి ఎమ్మెల్యేగా డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా పలువురు నాయకులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కామేపల్లి పోలేరమ్మ దేవాలయ ఈఓ రావెళ్ల శివ శంకర్, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు సత్యను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ పోలేరమ్మ దేవాలయ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ వుంటుందని అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

దర్శి నియోజకవర్గంలో వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటానని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం దర్శిలోని పొదిలి రోడ్‌లోగల వైసిపి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనకు విజయాన్ని అందించేందుకు కృషి చేసిన కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రాకపోయినప్పటికీ తాను 20 సంవత్సరాలుగా తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి ఎమ్మెల్యేగా, తన తల్లి జిల్లా పరిషత్ చైర్మన్‌గా సేవలందించారని, వాటితో పాటు తమ ట్రస్టు ద్వారా అందించిన సేవలకు గుర్తుగా ప్రజలందరూ తమను ఆదరించి గెలిపించారని అన్నారు. అందుకు నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అనంతరం మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి దర్శికి వచ్చిన డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలను దర్శి నియోజకవర్గంలోని వైసిపి అభిమానులు పెద్దఎత్తున సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ షకీల మిల్లర్ బుజ్జి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసీలు నుసుం నాగిరెడ్డి, రత్నంరాజు, మారం వెంకట్‌రెడ్డి,

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఎంపీపీలు గొల్లపాటి సుధారాణి, అచ్చయ్య, సుంకర సునీత, బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, వీరగంధం కోటయ్య, పోశం మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, తూము సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, జెసిఎస్ కన్వీనర్లు మేడికొండ జయంతి, మేరువా సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కుమిత అంజిరెడ్డి, తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీలు దుర్గారెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు ఐదు మండలాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీసు అధికారులు

ఎమ్మెల్యే బీఎన్‌కు పోలీసుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్‌ను ఒంగోలులోని ఆయన నివాసంలో శనివారం పలువురు పోలీసు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఒంగోలు రూరల్ సీఐ టీఎక్స్ అజయ్ కుమార్, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు ఎస్ఐలు దేవకుమార్, రామానాయుడు, మహేష్ ఉన్నారు.

నాణ్యమైన పొగాకు బేళ్లు తేవాలి

ప్రజాశక్తి-టంగుటూరు

పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా నాణ్యమైన పొగాకు బేళ్లను తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. కారుమంచి గ్రామానికి చెందిన రైతులు 839 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 764 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాల చేత 65 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.330, అత్యల్ప ధర రూ. 205, సరాసరి రూ.244-07 పలికింది.

బోనేని ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకుంటున్న కొమరోలు మండలం తాటిచెర్ల గ్రామస్తులు

టిడిపి విజయోత్సవాలు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలంలోని తాటిచెర్ల పంచాయతీ వైసీపీకి కంచుకోటగా ఉంటూ ప్రతి ఎన్నికల్లోనూ వైసీపీకి అఖండ మెజార్టీ ఇస్తూ వస్తోంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఊహించనంత మెజార్టీ వైసీపీకి లభించింది. దీంతో ఈ పంచాయతీ వైసీపీకి కంచుకోటగా మారింది. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి కొమరోలు మండల శాఖ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో ఆయన ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ కంచుకోటను బద్దలు కొట్టి పంచాయతీలో టిడిపికి మెజారిటీ వచ్చే విధంగా కృషి చేశారు. ఈ పంచాయతీకి చెందిన 244, 245 పోలింగ్ బూత్‌లలో టిడిపికి 771 ఓట్లు రాగా వైసీపీకి 697 ఓట్లు లభించాయి. దీంతో ఈ పంచాయతీకి చెందిన రెండు బూత్‌లలో కలిపి 74 ఓట్ల మెజారిటీ టిడిపికి లభించినట్లయింది. దీంతో ఆ పంచాయతీకి చెందిన టిడిపి కార్య కర్తలు వారి నాయకుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో ఆనందోత్సాహంతో రంగులు జల్లుకొని సంబరాలు జరుపుకున్నారు. టిడిపికి మెజారిటీ కట్టబెట్టిన పంచాయతీ ఓటర్లను బోనేని అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

నాగులుప్పలపాడు: సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అత్యధిక మెజారిటీతో విజయం సాధించడంతో మండలంలోని ఉప్పుగుండూరులో బెల్లం శ్రీను (కొమ్ము) ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. తొలుత గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం వరకు బాణాసంచాతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలిలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించి 111 టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వీరయ్య చౌదరి, టిడిపి గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు, బెల్లం వెంకటేశ్వర్లు, కనగాల శ్రీను, సెల్వం, జాన్సన్, జనసేన నాయకులు బాలిశెట్టి నాగేశ్వరరావు, పెంట్యాల శ్రీను, కిరణ్, బిజెపి నాయకులు ఆత్మకూరి వాసు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జరుగుమల్లి: కొండపి నియోజకవర్గంలోని కార్యకర్తలకు ఎల్ల వేళలా అందుబాటులో వుంటానని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. టంగుటూరులోని తన నివాసం వద్ద జరుగుమల్లి మండలంలోని చిరికూరపాడు గ్రామ ఉపసర్పంచి నలదల రామారావు ఆధ్వర్యంలో భారీగా టిడిపి శ్రేణులు వెళ్లి స్వామికి గజ మాలలు వేసి అభినందించారు. స్వామిని అభినందించిన వారిలో నలదల సుబ్బారావు, ఆరికట్ల రమణయ్య, గుండపనేని వెంకటేశ్వర్లు, నలదల కృష్ణారావు, నలదల వీరరాఘవులు, చెన్నారెడ్డి సుబ్బారావు, చిరికూరపాడు గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వామిని పూలమాలతో సత్కరిస్తున్న చిరికూరపాడు టిడిపి నాయకులు

ఉగ్రను కలిసిన చెరుకూరి సతీష్

ప్రజాశక్తి-పిసిపల్లి

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని మురుగుమ్మి ఎంపిటిసి సభ్యులు చెరుకూరి సతీష్, ఆయన తల్లి, పిసిపల్లి వైఎస్ ఎంపిపి చెరుకూరి ప్రసన్న, కుటుంబ సభ్యులతో కలిసి గుంటూరులోని ఉగ్ర నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. శనివారం గుంటూరులో ఉగ్ర నరసింహారెడ్డి గుంటూరులో నివాసం ఉంటున్న పిసిపల్లి మండల వాసులతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. గుంటూరులో నివాసం ఉంటున్న వెంగళాయపల్లి, వేపగుంపల్లి, పిసిపల్లి, మారెళ్ల, పోతవరం, పెద అలవలపాడు, గుదెవారిపాలెం పంచాయతీలకు చెందినవారు, ఉగ్ర నరసింహారెడ్డి గెలుపునకు కృషి చేశారు. కౌంటింగ్ అనంతరం గుంటూరుకు వెళ్లిన ఎమ్మెల్యే ఉగ్రను కలిసి అభినందించారు. సతీష్ తండ్రి దివంగత చెరుకూరి వెంకటస్వామి పెద అలవలపాడు సర్పంచ్‌గా, ఎంపిటిసిగా వుండి గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో, ఉగ్రతో కలిసి వుండేవారు. అప్పట్లో వెంకటస్వామి చొరవతో పెద అలవలపాడు వద్ద పాలేరుపై బ్రిడ్జి నిర్మాణానికి ఉగ్ర నిధులు మంజూరు చేసి పూర్తి చేశారు. ఆ విధంగా ఎమ్మెల్యే ఉగ్రతో సతీష్ కుటుంబానికి అవినాభావ సంబంధం ఉంది. మండల అభివృద్ధి కోసం, ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి పనిచేస్తామని వారు తెలిపారు.

ఉగ్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న సతీష్

నెమలిగుండ్ల ఆలయంలో మాగుంట రాఘవరెడ్డి

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామ సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయాన్ని శనివారం టిడిపి నాయకులు, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో స్వామివారికి మొక్కు చెల్లించేందుకు వచ్చినట్లుగా మాగుంట రాఘవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల మాజీ జడ్పీటీసీ పగడాల రంగశాయి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో మాగుంట రాఘవరెడ్డి

పొగాకు వేలం ఆరు రౌండ్లు పూర్తి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు శనివారంతో ఆరు రౌండ్లు పొగాకు కొనుగోళ్లు పూర్తయ్యాయి. సోమవారం (జూన్ 10) నుంచి 7వ రౌండ్ మొదలు అవుతుందని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ తెలిపారు. ఇప్పటివరకు గమనిస్తే 8.09 మిలియన్ల పొగాకు అమ్మకాలు జరిగాయని తెలిపారు. దీనిలో బ్రైట్ గ్రేడ్ రకం 15.80 శాతం, మీడియం గ్రేడు రకం 22.41 శాతం, తక్కువ గ్రేడ్ రకం 61.99 శాతం కొనుగోళ్లు జరిగాయన్నారు. ఇప్పటివరకు వచ్చిన పొగాకు సరాసరి ధర ఒక కేజీకి రూ.251.91 ధర వచ్చిందన్నారు. కిలో అత్యధిక ధర రూ.360 పలుకగా అత్యల్ప ధర రూ.205 పలికిందన్నారు. ఇప్పటివరకు జరిగిన వేలంలో అమ్మిన పొగాకు విలువ సుమారు రూ.204 కోట్లు ఉంటుందన్నారు. వేలంలో కంపెనీలు 46 పాల్గొన్నాయని, 76 రోజుల పాటు వేలం నిర్వహించామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే స్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న బెల్లం జయంతిబాబు

ఎమ్మెల్యే స్వామికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-టంగుటూరు

సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించిన కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, ఐటిసి దామచర్ల సత్యా కార్యాలయం వద్ద శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే స్వామికి అభినందనలు తెలిపిన వారిలో టంగుటూరు మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్, మండల టిడిపి అధ్యక్షులు కామని విజయకుమార్, రాష్ట్ర రైతు కార్య నిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మక్కెన హరిబాబు, దామచర్ల శ్రీధరబాబు, టంగుటూరు మాజీ ఉప సర్పంచి మక్కెన కోటేశ్వరరావు, టంగుటూరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గిరిజన చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామానికి చెందిన కంజుల శ్రీకాంత్‌రెడ్డి వారి సతీమణి స్వప్నల మొదటిపెళ్లి రోజు సందర్భంగా శనివారం శింగరాయకొండ మండలం పాతశింగరాయకొండ పరిధిలోని తాతయ్య గిరిజన కాలనీ చిన్నారులకు విద్యా సామగ్రిని అందజేశారు. అనంతరం వృద్ధులకు, గర్భిణులకు మరియు చిన్నారులకు భోజనం పంపిణీ చేశారు. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమం నిర్వహించిన న్యాయ సేవా సహాయకులు మరియు ఫ్రెండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పంతగాని వెంకటేశ్వర్లు తమకు సహకరించిన శింగరాయకొండ అప్డేట్స్ యువత రాకేష్‌కు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.330

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి శనివారం గురవారెడ్డిపాలెం గ్రామ రైతులు 940 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 887 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. కిలో అత్యధిక ధర 330 రూపాయలు పలుకగా అత్యల్ప ధర రూ.205 రూపాయలు పలికింది.

సుపరిపాలనకు శ్రీకారం చుడతా

ఎంఎల్ఎ నరేంద్ర వర్మ

ప్రజాశక్తి - బాపట్ల

అవినీతిని అంతమొందించి సుపరిపాలనకు శ్రీకారం చుడతానని ఎంఎల్ఎ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురపాలక సంఘంలో పాలనను ప్రక్షాళన చేస్తానని అన్నారు. మున్సిపాలిటీలో ప్రధానంగా మురుగు నీటి పారుదల, త్రాగునీటి సమస్య తీర్చేందుకు ప్రధాన్యత ఇస్తామన్నారు. పట్టణంలో త్రాగునీటి పైపుల లీకులతో మంచినీరు కలుషితం కావడం పట్ల పూర్తిస్థాయిలో మరమ్మత్తులు నిర్వహిస్తామని అన్నారు. మున్సిపాలిటీ రాబడి ఖర్చులపై ప్రతినెల సమీక్షిస్తామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కమిటీని ఏర్పాటు చేస్తామని అన్నారు. స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే విధంగా ఉద్యోగులు ప్రశాంతంగా బాధ్యతలు నిర్వర్తించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు పత్రికల ద్వారా తెలియజేసే విధంగా పాలన కొనసాగిస్తామని అన్నారు. బాపట్లను మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతామని

సమావేశంలో ఎంఎల్ఎ వేగేశన నరేంద్రవర్మ

అన్నారు. సూర్యలంక పర్యాటక కేంద్రాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. నాలుగు సార్లు బాపట్లలో టీడీపీ పరాజయం పాలైనప్పటికి ఈ సారి గెలవాలనే కసితో కృషి చేసిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు సలగల రాజశేఖరబాబు, పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షులు నామన శివన్నారాయణ, ఇనగంటి గాంధీ, ముక్కామల శివ, దయా బాబు, పఠాన్ రాజేష్ పాల్గొన్నారు.

ఆనవాలు కోల్పోతున్న చారిత్రక సాక్ష్యాలు

◆ రెడ్డి రాజులు పాలన నాటి కోట కట్ట మాయం ◆ గృహనిర్మాణాలతో కనుమరుగైన ఏనుగుల బావి

ప్రజాశక్తి - అద్దంకి

ఓ యాభై ఏళ్ల క్రితం వరకు పట్టణంలో ఏనుగుల బావి ఉండేది. ప్రస్తుతం అక్కడ ఒక ఇల్లు ఉన్నది. ప్రకాశం పంతులు బాల్యం కొంతకాలం అద్దంకిలో గడిచింది, ఏనుగుల బావిలోకి తాను దిగడం, పిల్లలతో ఈత కొట్టడం విషయాన్ని 'నా జీవన యాత్ర' పుస్తకంలో ఆయన వ్రాసుకున్నారని చరిత్ర కారులు, విశ్రాంత ఉపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ప్రజాశక్తితో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. ఏనుగుల బావి అద్దంకి కోట దక్షిణ హద్దును ఆనుకుని ఉండేదని తెలిపారు. కోటలోని ఏనుగులు ఈ బావిలో దిగి నీళ్లు త్రాగుతాయట. కాబట్టే ఈ బావికి ఏనుగుల బావి అని పేరు వచ్చింది. ఈ ఏనుగుల బావి సరిగ్గా గవర్నమెంటు ఆసుపత్రి రోడ్డుకు తూర్పుగా, బాలాంజనేయస్వామికి ఎదురుగా ఉన్న స్థలంలో ఉండేది. ఈ కోట కట్టపైనే రావినూతల విశ్వనాథం మాష్టారు పాత ఇల్లు, స్వీటు షాపు, ఆలూరి వెంకటరావు ఇల్లు ఉన్నాయి. ప్రోలయ వేమారెడ్డి పరిపాలనలో అద్దంకి సువిశాల తెలుగు రాజ్యానికి రాజధాని. ఆయన పరిపాలనలో అద్దంకి గొప్ప వైభవాన్ని సంతరించుకుంది. అద్దంకి కోట చుట్టూ నూరు పాలేలు ఉండేవి. వాటి తోటి అద్దంకి అందాల నగరంగా వర్ధిల్లింది. ప్రతి పాలెం ఒక గుడితో శోభిల్లింది. 'నూరు గుళ్ళు, నూరు బావులు లేదన్న వాడు గాడిదకడుపున పుడతాడనే' గాద్దభ శాసనం అద్దంకిలో వెలిసింది. ఈ గ్రామాలన్ని కోటను రక్షించేవి. కోటలోని వారికి కావలసిన వస్తు సమకూర్చేవి. ప్రోలయ వేమారెడ్డి తర్వాత వారు రాజధానిని కొండవీడుకు మార్చారు. అద్దంకి ఒక దుర్గంగా మాత్రమే మిగిలిపోయింది. రాయలు వారు తన దండయాత్రలో అద్దంకి దుర్గాన్ని కూడా సులభంగా వశం చేసుకున్నారు. దానికి సంబంధించిన ఒక చిన్నకథ ఏనుగుల బావితో ముడిపడి ఉంది. తిమ్మరుసు తెలివితేటలతో యుద్ధం చేయకుండానే అద్దంకి రాయల వారి వశమైంది. కొటికలపూడి యువతి కోటలోకి పాలు,పెరుగు తీసుకొని పోవడం గమనించిన తిమ్మరుసు ఆమెను భయపెట్టి కోటలోకి వెళ్ళే మార్గం తెలుసుకున్నారు. అదేమిటంటే కొటికలపూడి యువతి వెన్నముద్దను ఏనుగుల బావిలో వేసింది. అది సొరంగం ద్వారా గుళ్ళకమ్మలోకి చేరింది. ఏనుగుల బావిలోకి నీరు గుళ్ళకమ్మ ద్వారా చేరుతాయని తెలుసుకున్న తిమ్మరుసు, ఆ సొరంగమార్గం ద్వారా కోటలోనికి సైనికులతో ప్రవేశించి కోటను వశపరచుకున్నాడని పూర్వీకులు చెప్పేవారు. అందుచేత పెద్దగా యుద్ధం చేయకుండానే అద్దంకి దుర్గం రాయల వశమైంది. అద్దంకి కోటకట్ట చాలా ఎత్తుగా, చాలా విశాలంగా ఉండేది. ఇప్పటికి దాని గురుతులు

ఏనుగు భావిగా పేరు పొందిన స్థలంలో వెలసిన ఎత్తైన భవనాలు

పాతశివాలయం వెనుక, పాత తహశీల్దారు కార్యాలయం వాయువ్యభాగాన కనపడతాయి. కోట కట్టను చదును చేసి ఇళ్ళు కట్టుకున్నారు. కోటలోని పాటి మట్టిని ఇంటి గోడలకు వాడుకున్నారు. ఒక వందేళ్ళ కాలం కోటను మాయం చేసింది.

కోట కట్టపై కట్టుకున్న ఇళ్ళు మిగతా ఇళ్ళకంటే ఎత్తులో ఉండటం మనం గమనించవచ్చు. కోట కట్ట విస్తరించిన ప్రాంతం ఈ విధంగా ఉంది. పాతశివాలయం (రామలింగేశ్వరస్వామి గుడి) చుట్టుకుని, పాత తహశీల్దారు ఆఫీసుకు ఉత్తరం గోడ వైపుగాసాగి, ఆలూరి వెంకటరావు ఇంటి మీదుగా తూర్పుగా శంభుడు పంతులు బడి ప్రక్కగా, తూర్పుగా కొత్తపేట గుండా పోతురాజు గండిదాక సాగి, అక్కడి నుండి భవానీ టాకీసు (కోటకట్ట మీద కట్టబడినది), అటునుండి సాయిబ్బుల వీధికి దక్షిణంగా విస్తరించి (ఉత్తరపు కోటకట్ట), పడమట కట్ట క్రింద (కట్ట అంటే ఇక్కడ కోటకట్ట) పాలెంను ఆనుకుని చివరకు పాతశివాలయం చేరుతుంది. అంటే పాత శివాలయం, పోలేరమ్మ గుడి, వీరభద్ర స్వామి గుడి, బ్రహ్మంగారి గుడి మాత్రమే కోట లోపల ఉండే దేవాలయాలు. మిగిలిన దేవాలయాలు అద్దంకి కోటను చుట్టుకొని ఉన్న పాలేల్లో ఉన్నాయి. దామావారిపాలెంలో నరసింహస్వామి గుడి, వేయిస్తంభాల గుడి, కాకానిపాలెంలో వినాయకుని గుడి, కోదండ రామస్వామి గుడి, రంగనాయకుల స్వామి గుడి, వెంకటేశ్వరస్వామి గుడి, నంబూరివారిపాలెం ఆనుకొని కమఠేశ్వర స్వామి గుడి, ఆకులవారి మాన్యంలో మాధవస్వామి దేవాలయం ప్రముఖంగా కనపడతాయి. ప్రతి యేటా ఈ దేవాలయాల్లో అర్చక స్వాములు వైకుంఠ ద్వార దర్శనాలు ఏర్పాటు చేస్తారు. వైకుంఠ ఏకాదశి నాడు అద్దంకి నగరం వైకుంఠాన్ని తలపిస్తుంది భక్తజన సందోహాలతో అద్దంకిలోని దేవాలయాలు అన్నీ కళ కళలాడుతాని చరిత్రకారులు, విశ్రాంత ఉపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. చారిత్రక ఆనవాళ్ళు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజలపై ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు మన సంస్కృతి, జీవన విధానాన్ని వివరించే సాక్ష్యాలు చారిత్రక కట్టడాలేనని అన్నారు. చరిత్రక ఆధారాలు సంరక్షించాలని అన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్ బాబు

ఎన్నికల విధులకు హాజరు కాని ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

అనారోగ్య రీత్యా ఎన్నికల విధులకు హాజరుకాని ఉపాధ్యాయుల సస్పెన్షన్లను మానవతా దృక్పథంతో ఎత్తివేయాలని ఆలిండియా రాష్ట్రో పాధ్యాయ సంఘం జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన రాష్ట్రో పాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా శాఖ తొలి కార్యవర్గ సమావేశానికి జోసఫ్ సుధీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిరకమైన జెవికె కిట్లను విద్యార్థులకు సరఫరా చేసి అనేక అవక తవకలకు పాల్పడడంతో పాటు అక్రమ బదిలీలు చేయించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌పై విచారణ కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రవీణ్ ప్రకాష్ గత ప్రభుత్వ కాలంలో అన్యాయంగా చేసిన ఉపాధ్యాయుల సస్పెన్షన్లు, మెమోలు, పెండింగ్ చార్జీమెమోలను వెంటనే రద్దు చేయాలని అన్నారు. నూతన విద్యా విధానాన్ని తిరిగి పరిశీలించాలని కోరారు. జిఒ 117 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఐఆర్ ప్రకటించి, విశ్రాంత ఉపాధ్యాయులకు వెంటనే ఉద్యోగ విరమణ ప్రయోజనాలు చెల్లించాలని కోరారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్షపూరితంగా పెట్టిన కేసులు రద్దు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్నాథ్, జిల్లా గౌరవ అధ్యక్షులు చందు వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్లు గుగ్గిలం ఉదయ శంకర్, చందా నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నూరుబాషా సుభాని, బత్తుల నాగరాజు, ముజఫర్ జానీ, ఆసిఫ్ అలీ, శివాంజనేయులు, జి రమేష్ బాబు, కరీముల్లా, ప్రసాద్, ఏసురత్నం, ఓ శ్రీనివాసరావు, ఎవి నారాయణ, నర్రా సుబ్బారావు, అర్షదుల్లా బేగ్, పివిఎస్ ప్రసాద్, రాజేంద్ర, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో 79శాతం ఎంఎల్ఎలు నేరచరితులు

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రంలో లోనూతనంగా ఎన్నికైన శాసనసభ్యుల్లో 79శాతం మంది నేరచరిత్ర కలిగి ఉన్నారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు ఆరోపించారు. ఈ అంశంపై ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. నేర చరిత్ర గల ఎంఎల్ఏల్లో 56శాతం మంది తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏపి ఎంఎల్ఏల నేర చరిత్ర 2014 నుండి క్రమేపి పెరుగుతూ వస్తోందని అన్నారు. 2014లో 49శాతం మంది నేరచరిత్ర కలిగిన వాళ్ళు ఉంటే 2019లో 55శాతం, 2024లో 79 శాతానికి పెరగడం విశేషమని అన్నారు. బిజెపి ఎంఎల్ఏల్లో 88శాతం మంది నేర చరిత్ర కలిగి ఉండగా, టిడిపి ఎంఎల్ఏల్లో 86శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారని అన్నారు. వైసిపి ఎంఎల్ఏల్లో 55శాతం, జనసేన ఎంఎల్ఏల్లో 48శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారని తెలిపారు. రాష్ట్ర శాసనసభ్యుల్లో 93శాతం మంది కోటీశ్వరులుగా ఉన్నారని తెలిపారు. వీరి సగటు ఆస్తి విలువ రు.65.07 కోట్లుగా ఉందని తెలిపారు. ఇది జాతీయ ఎంపీల సగటు కంటే చాల ఎక్కువగా ఉన్నట్లు అధికారికంగా వెల్లడించిన అఫిడవిట్ల ద్వారా తెలుస్తుందని తెలిపారు. చట్టసభలకు ఎన్నికయ్యే ప్రజాప్రతినిధుల జీవిత నేపథ్యం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు చట్టసభల్లో చేస్తున్న నిర్ణయాలు ప్రజలకు నష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్థికంగా కోట్లకు పడగలెత్తిన వ్యాపార దిగ్గజాలు చట్టసభల్లో ప్రజల అవసరాలు కాకుండా వాళ్ల వ్యాపార సంస్థల ఆర్థిక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని చేస్తున్న నిర్ణయాలు ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మరొకరికి గాయాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామం నుండి కారుమంచి వెళ్లే రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్ప గాయాలు అయ్యాయి. గ్రామానికి చెందిన తత్కాలికం శ్రీనివాసరావు (50), మరొక వ్యక్తి వల్లెం వెంకటేశ్వర్లు ఇరువురు కలిసి మోటార్ సైకిల్‌పై శనివారం ఉదయం ట్రాక్టర్ కొనుగోలు నిమిత్తం దర్శి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని వినుకొండ, కారుమంచి మీదుగా ఏల్చూరు వస్తుండగా మార్గమధ్యలో ఏల్చూరు నుండి కారుమంచి వెలుతున్న కారు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైకుపై వెనుక కూర్చున్న వల్లెం వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఢీ కొన్న కారు ముందు భాగం నుజ్జు నుజ్జైంది. శ్రీనివాసరావు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాసరావు మృతి పట్ల ఏల్చూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలాన్ని ఎస్ఐ పి సురేష్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిల్ చెట్టుకు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - బాపట్ల

మోటార్ సైకిల్ కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరి మార్గ మధ్యలో ప్రమాదానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బాపట్ల – పొన్నూరు మధ్యలో అప్పికట్ల సమీపంలో నల్లమడ డ్రెయిన్ మలుపు వద్ద శనివారం చోటు చేసుకుంది. మండలంలోని మూలపాలెం పంచాయితీలోని మూర్తి రక్షణ నగర్ సమీపంలోని గాదె వెంకటరెడ్డి నగర్ ఎస్టి కాలనీకి చెందిన జీవన్ అనే యువకుడు కొత్త మోటార్ సైకిల్ కొనేందుకు జీవన్, నవీన్, శ్రీకాంత్ ముగ్గురు ఒక ద్విచక్ర వాహనంపై పొన్నూరుకు బయలుదేరారు. వీరితో పాటు పవన్ కుమార్, తిరువీధుల అంకమ్మరావు మరో ద్విచక్ర వాహనంపై జీవన్ అనే వ్యక్తికే మోటార్ సైకిల్ కొనుగోలు చేసేందుకు పొన్నూరు బయలుదేరారు. పవన్ కుమార్, తిరువీధుల అంకమ్మరావు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని పవన్ కుమార్ అతివేగంగా నడుపుతున్న క్రమంలో నల్లమడ డ్రెయిన్ దాటాక మలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న తిరువీధుల అంకమ్మరావు(19) తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యుల నిర్ధారించారు. ప్రమాదంలో గాయపడిన పవన్ కుమార్‌ను వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తమిళకాలనీ వాసులతో ఎంఎల్ఎ కొండయ్య

సిలోన్‌కాలనీలో ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట సిలోన్‌కాలనీ కాందిసీకులను ఎంఎల్ఎ కొండయ్య శనివారం కలిశారు. కాలనీవాసులను పలుకరించారు. కాలనీలోని ముత్తు మారియమ్మ ఆలయంను దర్శించుకున్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కరెంటు కష్టాలు వర్ణణాతీతం

- వేసవిలో ఓల్టేజీ, వర్షం పడితే కరెంటు బంద్
- పట్టించుకోని విద్యుత్తు అధికారులు
- తీగల నిర్వహణ వదిలేసిన అధికారులు
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు
- రూ.10వేలు ఇస్తే అనధికారికంగా ఎంత పనైనా చేస్తారు
- ఎంతటి వారైనా మీటర్ కోసం లైన్‌మెన్‌ను కలవాల్సిందే
- మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే సాకులతో జాప్యం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణం రోజు రోజుకి అభివృద్ధి చెందుతుంది. అదే స్థాయిలో అభివృద్ధి పనులు జరగాల్సి ఉంది. కానీ సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. తమ జేబులను నింపుకొనే పనిలో ఉన్నారే తప్ప ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదు. ప్రజల విద్యుత్ కష్టాలే నిదర్శనం. గత కొన్నేళ్లుగా విద్యుత్తు సమస్యలు ఉన్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారు.

ఇంప్రూమెంట్ ట్రాన్స్‌ఫారాలు ఎక్కడ

లో ఓట్టేజ్ సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలంటే సంబంధిత ప్రాంతాల్లో ఇంప్రూమ్మెంట్ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అవి ఏర్పాటు చేస్తే లో ఓల్టేజి సమస్య ఉండదు కదా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పట్టణంలో ఎక్కడ కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేదు. చినుకు పడినా, గాలి వీచినా విద్యుత్ ఉండదు. వేసవి వస్తే విద్యుత్తు లో ఓల్టేజ్ సమస్య వినియోగ దారులను కలవర పెడుతుంది. ప్రజలు ఇంత తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో అనేకసార్లు లో ఓల్టేజీ సమస్యతో గృహోపకరణాలు దగ్ధమైన సందర్భాలు ఉన్నాయి. సమస్య పరిష్కరించాలని అధికారులకు చెబితే ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన సందర్భాలు ఉన్నాయి. పట్టణానికి దక్షిణం వైపు ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ నుండి ఒకే ఫీడర్ ద్వారా పట్టణ, గ్రామీణ

చెట్ల కొమ్మలు అల్లుకున్న విద్యుత్ తీగలు

ప్రాంతానికి విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సమస్య వచ్చినప్పుడు అధికారులు విద్యుత్తును నిలుపుదల చేసి సమస్యను పరిష్కరిస్తున్నారు. తరచూ ఇలా జరుగుతూ ఉండడంతో అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో మీనాక్షి రెస్టారెంట్ ప్రాంతం నుండి లో ఓల్టేజి సమస్య అత్యంత ఎక్కువగా ఉందని, దీనితోపాటు భాగ్యనగర్, దామవారి పాలెం, కాకానిపాలెం ప్రాంతాల్లో లో ఓల్టేజితో ఇబ్బందులు పడుతున్నారు.

గాలికి వదిలేసిన తీగల నిర్వహణ

విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా విద్యుత్తు తీగల నిర్వహణ చేస్తుంటారు. అద్దంకిలో మాత్రం విద్యుత్ అధికారులు మాత్రం విద్యుత్తు లైను క్రింద ఉన్న చెట్టు కొమ్మలను కూడా తొలగించే పరిస్థితి లేదు. గాలి వీచినా, వర్షం జల్లులు కురిసినా చెట్టు కొమ్మల వలన విద్యుత్తు ట్రిప్ అవుతుంది. విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుంది. గ్రామీణ ప్రాంతంలో ఎప్పుడు విద్యుత్తు వస్తుందో, ఎప్పుడు విద్యుత్ సరఫరా నిలిపేస్తారో తెలియదు. పెరుగుతున్న ప్రజల అవసరాల రీత్యా గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్యుత్తు వినియోగం పెరిగింది. అదే సమయంలో అవసరానికి తగిన సరఫరా సామర్థ్యం మాత్రం పెంచలేదు.

విద్యుత్తు అధికారులు నిర్లక్ష్యం

విద్యుత్‌పై జీవన పరిస్థితులు ఆధారపడిన నేపధ్యంలో కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కోకోల్లలు కనిపిస్తున్నాయి. అవి ఏ రోజు క్రింద పడతాయో తెలియని పరిస్థితి ఉంది. బొమ్మనంపాడు గ్రామ సమీపంలోని సుబాబులు పొలాల్లో విద్యుత్ స్తంభాలు సగం విరిగిపడి ఉన్నాయి. ఆ ప్రాంతంలో పశువులు మేపుకునే రైతులు ఆ విద్యుత్తు వైర్లను చూసి భయపడుతూ ప్రమాద కర స్థితిలో పశువులను మేపుకుంటున్నారు. ఈ విషయం గురించి అనేకసార్లు ఆ ప్రాంత ప్రజలు అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ పట్టించుకోలేదు.

లైన్‌మెన్ల చేతివాటంతో ప్రజలకు ఇబ్బందులు

ఇంటి అవసరాలకు విద్యుత్తు మీటరు రావాలంటే సంబంధిత లైన్‌మెన్‌ను ప్రసన్నం చేసుకోవాల్సిందే. వినియోగదారుడు స్వతగా దరఖాస్తు చేసుకుంటే ఆ ఇంటికి మీటరు రాదు. అనేక అనవసర కారణాలు చూపి ఇబ్బంది పెడతారు. మన అర్జీ విద్యుత్ అధికారులకు వెళ్లినప్పటికీ కుంటి సాకులతో మీటర్ వెనుకకు పంపిన సందర్భాలు ఉన్నాయి. ఆ లైన్ మెన్ జేబు నింపితేనే మరలా విద్యుత్తు మీటరు వస్తుంది. దీంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒక లైన్‌మెన్ సంబంధిత అధికారిని తన అదుపులో ఉంచుకుని అనధికారికంగా కొత్త స్తంభాలు ఏర్పాటు, లైన్లు ఏర్పాటు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు విద్యుత్ అధికారులు గత కొన్నేళ్లుగా ఇక్కడే పాతుకుపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని చెబుతున్నారు. నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిన విద్యుత్ అధికారులను మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విద్యుత్ వినియోగదారుల సమస్యలు తీర్చాలని కోరుతున్నారు.

రామోజీరావుకు నివాళి అర్పిస్తున్న గొట్టిపాటి రవికుమార్

రామోజీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

అక్షర యోధుడు, నిరంతర శ్రామికుడు, రామోజీ గ్రూపు సంస్థల అధినేత, ఈనాడు వ్యవస్థాపకులు చెరుకూరి రామోజీరావు అస్తమించడంతో శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ రామోజీరావు పార్థివ దేహాన్ని సందర్శించి ఘన నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కొల్లూరు : స్థానిక టిడిపి కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూధన ప్రసాద్ ప్రముఖ పారిశ్రామికవేత్త చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి శనివారం ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గుత్తికొండ బుజ్జి, ధూళిపూడి కృష్ణ, సమ్మెట దుర్గాప్రసాద్, నాని, సుధాకరరావు, మేకల బాలాజీ, ఆలపాటి వాసు, తోట సాంబశివరావు, మత్తి నాగేంద్ర, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్, మీడియా దిగ్గజం చెరుకూరి రామోజీరావు పార్థివ దేహానికి పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రామోజీరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక పద్ధతులు, సలహాలు, సూచనలు అందించేందుకు ఎంఎల్‌ఎ ఏలూరి ఆధ్వర్యంలో రంగు రంగుల పేజీలతో అగ్రి క్లినిక్ మాసపత్రికను రైతుల చెంతకు చేర్చిన ఏలూరిని అప్పట్లో రామోజీరావు అభినందించారని గుర్తు చేసుకున్నారు.

ఇంకొల్లు : టిడిపి, జనసేన, బిజెపి నాయకులు టిడిపి కార్యాలయం వద్ద రామోజీ గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామాజీరావుకు మృతికి సంతాపం ప్రకటించారు. కొద్దిసేపు మౌనం పాటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయుడు హనుమంతరావు, బొడావుల శ్యామ్‌సుందర్, గంట బాబు, కరణం రమేష్, పాలేరు రామకృష్ణ, శ్రీనివాసరావు, పి హనుమయ్య, ఎం శ్రీనివాసబాబు.,పెదపూడి విజయకుమార్ పాల్గొన్నారు.

బాపట్ల : ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతికి ఎంఎల్‌ఎ వేగేశన నరేంద్రవర్మ సంతాపం తెలిపారు. రామోజీరావు చిత్రపటానికి నివాళి అర్పించారు.

సముద్రాలు కాపాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జీవవైవిధ్యాన్ని కాపాడండి

ప్రజాశక్తి - బాపట్ల

భూ వాతావరణ సమతుల్యతను పరిరక్షించడంలో సముద్రాలు మానవాళికి మహోపకారం చేస్తాయని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. శనివారం ప్రపంచ సాగర దినోత్సవం సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎంజి బాలికల ఉన్నత పాఠశాల్లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. వాతావరణంలో ఏర్పడుతున్న కాలుష్యాన్ని నివారించి ప్రజలకు మేలు చేసే అద్భుతమైన పాత్ర సముద్రాలు పోషిస్తాయని అన్నారు. బొగ్గు పులుసు వాయువును శోషించుకుని ప్రాణవాయువును జీవజాతులకు అందిస్తాయని అన్నారు. భూతాపాన్ని నియంత్రించి జీవ వైవిధ్యానికి పట్టుగొమ్మలుగా నిలుస్తాయని అన్నారు. ఎన్నో రకాల జీవుజాతులకు ఆవాసాలు కాగా భూగోళానికి సముద్రాలు ఊపిరితిత్తుల వంటివని అన్నారు. రూ.కోట్ల విలువైన వనరులను జాతికి అందజేస్తాయని అన్నారు. మానవాళికి ఎంతగానో ఉపయోగపడే సముద్రాలను అనేక వ్యర్థాలతో కలుషితం చేస్తున్నామని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్రాలు కలుషితం కావడంతో ఎన్నో జీవరాసులు అంతరిస్తున్నాయని అన్నారు. దీనివల్ల జీవ వైవిద్యం దెబ్బతింటుందని తెలిపారు. సముద్రాలను పరిరక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సముద్రాలను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. సముద్ర జాలాల్లోని జీవరాసులను రక్షించాలంటే కలుషితం కాకుండా నివారించాలని సూచించారు. పర్యావరణ రక్షణతోపాటు ఆర్థిక వనరుగా లాభాలు ఇస్తాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలినడకన గుణదలకు..

- పంగులూరు నుండి గుణదలకు
- ఇంకొల్లులో ఆంజనేయ స్వామి వద్దకు టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి - పంగులూరు

ఎంఎల్‌ఎగా గొట్టిపాటి రవికుమార్ 5వ సారి విజయం సాధించడంతోపాటు రాష్ట్రంలో తెలుగుదేశం అధికారానికి వచ్చి చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా మండలంలోని ముప్పవరం ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్తలు కాలినడకన వెళ్లి గుణదల మేరీ మాతను దర్శించుకునేందుకు శనివారం బయలుదేరారు. ముప్పవరం జాతీయ రహదారి పక్కనున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడి నుండి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పరిపాలన మళ్లీ మొదలు కాబోతుందని అన్నారు. ప్రజలు టిడిపిని ఆదరించి రవికుమార్‌ను మరోసారి ఎంఎల్‌ఎగా భారీ మెజార్టీతో గెలిపించారని అన్నారు. పేద వర్గాల అభివృద్ధి కోసం పనిచేసే చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నాడని అన్నారు. రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని అన్నారు. గుణదల మేరీ మాత ఆలయానికి పాదయాత్రగా బయలుదేరుతున్న దళిత యువకులను ఆయన అభినందించారు. పాదయాత్రలో చింతల నాగేశ్వ రరావు, దుడ్డు మత్తయ్య, వేల్పుల మరియదాస్, వేల్పుల అశోక్, చింతల డేవిడ్ పాల్, అద్దేపల్లి ఏసుబాబు, వేల్పుల ఏసుబాబు, కొమ్ము డేవిడ్, అద్దేపల్లి వందనం, అద్దేపల్లి రవీంద్ర, అంజయ్య, తాతపూడి వందనం ఉన్నారు. రావూరు రమేష్, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, వలపర్ల సుబ్బా రావు, గరిమిడి జగన్ మోహనరావు, దూళిపాళ్ల భావనా రాయణ, వీరాంజనేయులు, శంకర్, హనుమంతరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పర్చూరు ఎంఎల్‌ఎ ఏలూరు సాంబశివరావు అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా మండలంలోని పూసపాడు, కారంచేడు మండలం తిమర్తపాడు గ్రామస్తులు శనివారం ఉదయం ఆయా గ్రామాల నుంచి ర్యాలీగా బయలుదేరి ఇంకొల్లు పొలిమేర ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ముందుగా తిమిర్తిపాడు గ్రామానికి చెందిన టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు పూసపాడు చేరి అక్కడ నుంచి అడ్డరోడ్డు, దగ్గుబాడు, నాయుడు వారిపాలెం మీదుగా ఇంకొల్లు పర్చూరు రోడ్డులోని ఆంజనేయస్వామి, టిడిపి కార్యాలయం, రామ మందిరం, స్తూపం సెంటర్, జండా చెట్టు మీదుగా పెద్ద బజారు నుంచి శివాలయంకు చేరి అక్కడ నాగుల చెరువు కట్టమీద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఇంకొల్లు పొలిమేర ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. టిడిపి మండల అధ్యక్షులు నాయుడు హనుమంతురావు, ఇంకొల్లు మాజీ సర్పంచి బోడోల శ్యాంసుందర్, జనసేన రాష్ట్ర నాయకులు పెదపూడి విజయకుమార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. తిమిర్తిపాడు టిడిపి నాయకులు బొడావుల రంగనాయకులు, దండా శ్రీనివాసరావు, పోపూరి శివయ్య, దండా మోహన్, పాశం వీరాంజనేయులుతోపాటు పెద్ద సంఖ్యలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని పూసపాడు నుంచి అడ్డరోడ్డు మీదగా దగుపాడు, ఇంకొల్లు స్థూపం సెంటర్, ఎన్టీఆర్డు విగ్రహం, పొలిమేర ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన గంటా బాబు, కరణం రమేష్, పర్చూరు శీను, కంకట రాంబాబు పాల్గొన్నారు.

గుణదల మేరీమాత ఆలయానికి టిడిపి నేతల పాదయాత్ర

ఇంకొల్లు ఎన్టీఆర్ వీధిలో పూసపాడు గ్రామస్తుల పాదయాత్ర

బెట్టింగులతో జేబులు ఖాళీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తామే గెలుస్తామని పందేలకు దిగిన ఆశావాహుల జేబులు ఖాళీ అయ్యాయి. ఎన్నికల ఫలితాలపై టిడిపి, వైసిపి గెలుపుపై స్థానిక అభ్యర్థులకు వచ్చే మెజార్టీలపై, గ్రామాల వారీగా వచ్చే ఆధిక్యతపై జూదరులు బెట్టింగులకు దిగారు. 20 గ్రామాల్లోను రూ.కోట్లలో బెట్టింగులు కాశారు. టిడిపి అత్యధిక సీట్లు సాధించడంతోపాటు టిడిపి ఎంఎల్‌ఎ గొట్టిపాటి రవికుమార్ ఊహించని విధంగా 24వేల పైచిలుకు మెజార్టీ సాధించారు. దీంతో వైసిపిపై పందాలు కాసినవారు చేతులు కాల్చుకొని రూ.కోట్ల నగదు పోగొట్టుకున్నారు. దీంతో ఇరు పార్టీల వద్ద నుంచి సొమ్ము సేకరించి భద్రపరిచిన దళారులు ఐదు శాతం కమిషన్ పట్టుకొని లాభపడ్డారు. బెట్టింగ్ సొమ్ము గెలిచిన వారికి తిరిగి చెల్లించే క్రమంలో అక్కడక్కడ వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్క ఏల్చూరు, సంతమాగులూరు, అడవి పాలెం గ్రామాల్లోనే రూ.20కోట్లకుపైగా బెట్టింగులు జరిగినట్లు అంచనా. గ్రామాల్లో జూదం ప్రభావంతో వివాదాలు చెల రేగకుండా పోలీసులు దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు జెవివి జోనల్ స్థాయి వర్క్‌షాప్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, ఎల్‌బిజి భవన్‌లో జనవిజ్ఞానవేదిక జోనల్ స్థాయి వర్క్‌షాప్ ఆదివారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు జెవివి ప్రకాశం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సిహెచ్.జయప్రకాశ్ తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, పల్నాడు జిల్లా కమిటీల సభ్యులు, ఎంపిక చేయబడిన ప్రతినిధులు వర్క్‌షాపునకు హాజరుకానున్నారన్నారు. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ యం.గేయానంద్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ వర్క్‌షాపునకు రిసోర్స్‌పర్సన్‌లుగా హాజరవుతున్నారన్నారు. ప్రజాసైన్స్ ఉద్యమం- తాత్విక పరిజ్ఞానం', శాస్త్రీయ దక్పథం వ్యాప్తికి ప్రాథమిక రంగాలు, సంస్థాగత నిర్మాణ కర్తవ్యాలు, శాస్త్రీయత ప్రచార పద్ధతులు వంటి అంశాలపై వర్క్ షాప్ లో చర్చించనున్నారన్నారు. జెవివి లక్ష్యమైన శాస్త్రీయ సమాజ ఏర్పాటుకై జరుగుతున్న కషిని మరింత బలోపేతం చేసేందుకు ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఆయా జిల్లాల కార్యదర్శి వర్గ సభ్యులు, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కమిటీల సభ్యులు హాజరై వర్క్ షాప్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు.

దామచర్ల గెలుపునకు ఎంఆర్‌పిఎస్ కృషి: ఆనంద్ మాదిగ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్టీయే కూటమి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు గెలుపునకు ఎంఆర్‌పిఎస్ ఎంతో కృషి చేసిందని జిల్లా ఇన్‌చార్జి తొరటి ఆనంద్ మాదిగ అన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావును శనివారం ఎంఆర్‌పిఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తొరటి ఆనంద్ మాట్లాడుతూ మందకష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎన్డీయే కూటమి అభ్యర్థులు గెలుపునకు ఎంఆర్‌పిఎస్ కీలకపాత్ర పోషించిందని, ఎన్డీఏ గెలుపు మాదిగల గెలుపు నినాదంతో అహర్నిశలూ కృషి చేశామన్నారు. ఎమ్మెల్యే దామచర్లను కలిసిన వారిలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్.రాజు మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసింగ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదిమూలపు ప్రకాష్ ఒంగోలు ఇన్‌ఛార్జి తిరువీది బాబు, రావినూతల కోటయ్య ఉన్నారు.

కొండయ్యకు శుభాకాంక్షలు చెబుతున్న పోలీసు అధికారులు

ఎమ్మెల్యే కొండయ్యకు సత్కారం

ప్రజాశక్తి-చీరాల

చీరాల నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎంఎం కొండయ్య ను నియోజకవర్గం అధికారులు,నాయకులు, పలువురు కలసి శుభాకాంక్షలు తెలపారు.ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ కొండయ్య ను టిడిపి చీరాల నియోజకవర్గ ముఖ్య నేతలు కలసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలోని వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, డి.ఎస్.పి ప్రసాద్ సిఐలు శేషగిరిరావు, సోమశేఖర్, నిమ్మగడ్డ సత్యనారాయణ, కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు హి కార్యలయంలో కూడా కలసి కొండయ్య ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చీరాల ప్రాంతంలోని ముఖ్య నేతలు కొండయ్య ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

నీట్‌లో 'వశిష్ట' విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విజయకేతనం చూపిస్తున్న విద్యార్థులు

నీట్-2025 పరీక్షా ఫలితాలలో శ్రీ వశిష్ట మెడికల్ అకాడమీ విద్యార్థులు విజయ భేరి మోగించారు. అకాడమీలో శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో డైరెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ అకాడమీ నుంచి 52 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరు కాగా 21 మంది విద్యార్థులకు ఎంబిబిఎస్ సీట్లు సాధించారన్నారు. 14 మంది విద్యార్థులకు బిడిఎస్ సీట్లు, 4 మంది విద్యార్థులు వెటర్నరీ సీట్లు వచ్చాయన్నారు. 720 మార్కులకు తమ విద్యార్థులు పి.రోహిత్ బాబు 611 మార్కులు, ఎస్‌కె ఖాజా ఆఫ్రిది 600 మార్కులు సాధించారన్నారు. 500 మార్కులకు పైగా 18 మంది విద్యార్థులు అందుకున్నారన్నారు. నీట్ పరీక్షా ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అకాడమీ ఏఒ కె.సురేష్ బాబు, ప్రిన్సిపల్ కృష్ణ ప్రియ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు ఖ్యాతిని ఇనుమడింపజేసిన రామోజీరావు

ఎమ్మెల్యేలు దామచర్ల, ముత్తుముల, బిఎన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేసిన గొప్ప వ్యక్తి చెరుకూరి రామోజీరావు అని ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, గిద్దలూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బిఎన్ విజయకుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి కొనియాడారు. ఒంగోలు టిడిపి కార్యాలయంలో ఈనాడు సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, వై.పాలెం టిడిపి ఇన్‌చార్జి గూడూరి ఎరక్షన్‌బాబు పాల్గొన్నారు.

ప్రరసం నివాళి

రామోజీరావు మృతిరి చింతిస్తూ ప్రకాశం జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో శనివారం సంతాప సభ నిర్వహించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు.

రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు

మాగుంట సంతాపం

రామోజీరావు మృతికి ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతాపం ప్రకటించారు.

పోతుల రామారావు సంతాపం

రామోజీరావు మృతికి కొండపి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు సంతాపం తెలిపారు. తెలుగు ప్రజల ఆస్తిగా రామోజీ రావును అభివర్ణించారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

రామోజీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతి పట్ల ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్‌వి బ్రహ్మం సంతాపం తెలిపారు. జర్నలిజం, చలనచిత్ర పరిశ్రమ మీడియాపై సరైన ముద్ర వేశారని, మీడియా రంగంలో రామోజీ సేవలు మరువలేనివన్నారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో..

రామోజీరావుకు ఘన నివాళి

రామోజీరావు మృతికి కవులు, కళాకారులు సంతాపం ప్రకటించారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ నరసం కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, డాక్టర్ నూనె అంకమ్మరావు పాల్గొన్నారు.

పత్రికారంగానికి తీరనిలోటు

రామోజీరావు మృతి ప్రతికా రంగానికి తీరని లోటని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జి.వీరభద్రాచారి తెలిపారు. శనివారం సంఘం కార్యాలయంలో సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

గ్రామీణ వైద్యుల నివాళి

రామోజీరావుకు ప్రకాశం జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బట్టు బాలాజీ, జిల్లా కార్యదర్శి కె.బాలచంద్రం, గౌరవాధ్యక్షులు వేముల మాలకొండయ్య, జిల్లా మీడియా ఇన్చార్జి దాసరి సుధాకర్ యాదవ్ నివాళులర్పించారు.

వైసిపి ఆశలన్నీ ఆవిరి..

సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి మరోసారి అధికారంలోకి వస్తామన్న వైసీపీ ఆశలను ఓటర్లు అడియాశలు చేశారు. మరీ ముఖ్యంగా బాపట్ల జిల్లాలోని ఆరు స్థానాలను టిడిపి గెలుచుకోవడంతో జిల్లా క్లీన్ స్వీప్ అయ్యింది. ప్రకాశం జిల్లాలో కూడా రెండు స్థానాలు మినహా మిగతా ఆరు స్థానాల్లో కూడా టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. బాపట్ల, ఒంగోలు లోక్‌సభ స్థానాల నుంచి కూడా టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. బాపట్ల టిడిపి ఎంపీ అభ్యర్థి రికార్డు స్థాయిలో రెండు లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇంత ఘోర పరాజయం ఉంటుందని ఏ మాత్రం ఊహించని వైసీపీ నేతలు ఇలా ఎందుకు జరిగింది.? అనే విషయమై తర్జనభర్జన పడుతున్నారు. గడిచిన ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం అనుసరించిన విధానాలు, స్థానికంగా వచ్చిన వ్యతిరేకతలు, పలు ఇతర కారణాలతో తాము ఓటమి బాట పట్టామన్న అంచనాలకు వైసిపి నేతలొచ్చినట్లు తెలుస్తోంది. గెలుస్తామన్న గట్టి నమ్మకంతో ఉన్న నేతలు తాము ఎందుకు ఓడిపోయామనే విషయమై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. తమకు ఏ ప్రాంతంలో ఓట్లు తగ్గాయి.. ఎందుకు తగ్గాయి.. అనే విషయమై ఆరా తీస్తున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం కొన్ని సర్వే సంస్థలు విడుదల చేసిన లెక్కలను నమ్మి వైసీపీ గెలుస్తుందని పందాలు కాసినవారు లక్షల రూపాయలు పోగొట్టుకుని అప్పులపాలయ్యారు.

ఈ ఎన్నికల్లో వైసిపి వారు తాము చేసిన అభివృద్ధి పనులు, తిరిగి గెలిస్తే తామేమీ చేస్తామనే అంశాలతో పాటు పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన పలు సంక్షేమ అభివృద్ధి, పనుల గురించి విస్తృత ప్రచారం చేశారు. టిడిపి వాళ్లు కూడా తమ మెనిఫెస్టోలో పెట్టిన అంశాలతో పాటు వైసిపి ప్రభుత్వం వల్ల ప్రజలకు జరిగిన నష్టాల గురించి, రాష్ట్రం వెనుకుబాటు తనం గురించి చెప్పడంతో పాటు స్థానిక అంశాలపై దృష్టి పెట్టి ప్రచారం చేశారు. ఎన్నికల్లో రెండు పార్టీల వారు తమ శక్తి మేరకు ఓటుకు నోటు ఇచ్చారు. ఓటర్లు కూడా ఇరుపక్షాల నుంచి తీసుకున్నారు. త్రిముఖ పోటీ జరిగిన చీరాల లాంటి చోట ముగ్గురు అభ్యర్థుల నుంచి ఓటును నోటు తీసుకున్నారు. ఇలా తీసుకోవడం తమ హక్కు అన్నట్లుగానే భావించారు. ఎక్కడయినా అభ్యర్థుల నుంచి నగదు రాకపోతే వారిని నిలదీశారు. చివరికి తాము ఎవరికి ఓటు వెయ్యాలని భావించారో వారికే ఓట్లు వేశారు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఇరుపక్షాల నుంచి ఓటుకు నోటు తీసుకుంటే తమ కుటుంబంలో ఉన్న ఓట్లు ఇద్దరికీ విభజించి వేసే వారు. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం అత్యధికులు తాము తీసుకున్న నగదుతో సంబంధం లేకుండా ఓట్లను ఏకపక్షంగా పోల్ చేశారు. ఈ కారణంగానే వైసిపి వారు టిడిపి కన్నా మెరుగ్గా నగదు పంపిణీలు, ఓటరును సంతృప్తిపరిచే పనులు చేపట్టినప్పటికీ ఓటమి పాలుకాక తప్పలేదు. అయితే తమ వరకు తాము తప్పు లేకుండా అన్ని విధాలుగా ఓటరును చేరుకున్నామని, కానీ తమపై తీవ్రస్థాయిలో ఉన్న వ్యతిరేకత కారణంగా ఓటమి తప్పలేదన్న భావనకు వైసిపి వాళ్లొచ్చారు.

ఎన్నికల్లో తమ కుమారులు రాజకీయ భవిష్యత్‌ను ఒక కొలిక్కి తేవాలన్న సీనియర్ నేతల ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఉన్న ఏ నేతకు ఈ ఎన్నికలు కలిసిరాలేదు. జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న కరణం బలరామకృష్ణమూర్తి, తన కుమారుడు కరణం వెంకటేష్ రాజకీయ భవిష్యత్ కోసం విశేషకృషి చేశారు. చీరాలలో తాను పోటీ చేసి గెలిచిన 2019 ఎన్నికల కంటే మిన్నగా ఈ ఎన్నికల్లో ఓటర్లను కలిశారు. వార్డులు, గ్రామాలు, కొన్ని చోట్ల ఇల్లిల్లూ తిరిగారు. కానీ వైసిపిపై ఉన్న విపరీతమైన వ్యతిరేకత కారణంగా వెంకటేష్‌కు ఓటమి తప్పలేదు. జిల్లాలో మరో నేత బాచిన చెంచుగరటయ్య కూడా తన కుమారుడు కృష్ణచైతన్య కోసం తన రాజకీయ భవిష్యత్‌ను పణంగా పెట్టారు. అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న కృష్ణచైతన్య పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు వైసిపి పక్షాన ఇల్లిల్లూ తిరిగారు. నాలుగున్నరేళ్ల అద్దంకిని అంటిపెట్టుకొని రాజకీయం చేశారు. కానీ ఎన్నికల ముందు ఆయన్ను తప్పించి పాణెం హనిమిరెడ్డిని వైసిపి తరపున అద్దంకి అభ్యర్థిగా తెచ్చారు. దీంతో కృష్ణచైతన్య రాజకీయ భవిష్యత్ అమోమయమైంది.

ఎన్నికల ముందు టిడిపిలో చేరారు. కానీ గరటయ్య టిడిపి తరపున ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. కృష్ణచైతన్య ఇంటికే పరిమితం అయ్యారు.రేపల్లే నుంచి అక్కడ నేతగా ఉన్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ తన కుమారుడిని ఎన్నికల బరిలోకి దింపాలని ఆలోచన చేశారు. కానీ వైసిపి అధినేత జగన్ రేపల్లెలో రాజకీయ ప్రయోగం చేసి.. అక్కడ నుంచి ఈపూరి గణేష్‌ను ఎన్నికల బరిలోకి దింపారు. దీంతో మోపిదేవి కుమారుడికి రాజకీయ ఆరంగ్రేటం ఈ ఎన్నికల్లో కుదరలేదు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ ఎన్నికల్లో ఒంగోలు నుంచి తన కుమారుడు రాఘవరెడ్డిని ఎన్నికల బరిలో నిలపాలనుకున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో రాఘవరెడ్డి పర్యటనలు కూడా చేశారు. కానీ ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆయన చిక్కుకున్న నేపథ్యంలో సాంకేతిక కారణాలతో ఈ ఎన్నికల్లో పోటీ కుదరలేదు.

రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో జిల్లాకు ఇచ్చిన హామీలపై చర్చ మొదలయింది. కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పాటు, కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపడం ముఖ్యమైన హామీలుగా ఉన్నాయి. దీంతో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలో నియోజకవర్గాల మార్పులు తప్పని పరిస్థితి నెలకొంది. అద్దంకి బాపట్ల జిల్లా నుంచి వెళితే పర్చూరు సంగతి ఏమిటేనేది ప్రశ్న. జిల్లా మార్పులు అనేది తేనేతుట్టేను కదిలించడం లాంటిదేననే భావన ఉంది. కొత్త డిమాండ్లు వచ్చే అవకాశం ఉంది.

టీడీపీ కూటమి ఇచ్చిన పలు హామీల అమలుపై ప్రజల్లో చర్చలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం గురించి చర్చలు షురూ అయ్యాయి. ఇచ్చిన హామీల్లో మెగా డీఎస్సీపై మొదటి సంతకం, వద్ధాప్య పెన్షన్ రూ.4 వేలకు పెంపు, వికలాంగులకు పెన్షన్ రూ.6 వేలు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకి రూ.1500, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకి రూ.3000 నిరుద్యోగ భతి, తల్లికి వందనం కింద ఎంత మంది బిడ్డలు ఉన్నా ఏడాదికి ఒకో బిడ్డకు రూ.15 వేలు, ప్రతి కుటుంబానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి రైతుకు ఏడాదికి రూ 20 వేల పెట్టుబడి, వాలంటీర్ల గౌరవ వేతనం నెలకు రూ.10 వేలు, భూహక్కు చట్టం రద్దు, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, ప్రతి పేదవాడికి రెండు సెంట్ల ఇళ్ల స్థలం తదితర హామీల అమలుపై చర్చలు మొదలయ్యాయి. ఇచ్చిన హామీలను ఎంత మేరకు అమలు చెయ్యగలరో వేచి చూడాల్సి ఉంది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా